Follow: @ANNTELUGU
01-09-2026
ANN తెలుగు
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 235 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## వెలిగొండ.. బంగారుకొండే

- నెరవేరిన మూడు దశాబ్దాల కల
- మార్కాపురం ప్రజలకు కృష్ణా జలాలతో స్వాగతం
- ప్రాజెక్టును ప్రారంభించి చంద్రబాబు ఉద్వేగం
- మార్కాపురం అన్ స్టాపబుల్.. ప్రజలతో కలిసి కండువా ఊపిన సీఎం

**ఒంగోలు, మహా :** కరవు, ఫ్లోరైడ్‌తో అలసిన మార్కాపురం ప్రజలకు.. కృష్ణా జలాలతో స్వాగతం చెబుతున్నామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. కృష్ణమ్మను తీసుకొచ్చాం.. కరవును తరిమికొట్టామని అన్నారు. వెలిగొండకు జల సిరులు.. అభివృద్ధికి రెక్కలు అని పేర్కొన్నారు. వెలిగొండ నిజంగానే బంగారు కొండ అని ఆయన అభివర్ణించారు.

మిగతా 3వ పేజీలో

టాప్ న్యూస్



మెస్సి సంచలన నిర్ణయం
### ఫుట్‌బాల్‌కు గుడ్‌బై
- 207 మ్యాచ్‌ల్లో 125 గోల్స్
- గోల్ స్కోరర్ల జాబితాలో రెండో స్థానం

02



### కేరాఫ్ హస్తిన నేడు ఢిల్లీకి సీఎం
- రెండు, మూడురోజులు హాట్ డిస్కషన్స్

02



### అంతులేని యుద్ధం కాదు ..యుద్ధానికి ముగింపు కావాలి
- పుతిన్‌తో మోదీ
- ఉక్రెయిన్ యుద్ధంపై ముగింపుకు వెళ్ళాలని సందేశం

03

# కేసీఆర్ రాజీనామాకు సీఎం డిమాండ్

## నాకు కేసీఆర్ కు పోలికేంటి?



- నందికి పందికి ఉన్నంత తేడా ఉంది
- నేను గంట కూడా వెయ్యిరోజుల్లో రెస్ట్ తీసుకోలే
- కేసీఆర్.. గంట కూడా పనిచేయకుండా 22కోట్ల ప్రజాధనం
- కేసీఆర్ హయాంలో.. బంధువులకు పదవులు.. నా హయాంలో బడుగులకు పదవులు
- వెయ్యిరోజుల్లో ప్రజాధనం వేస్ట్ చేసిన కేసీఆర్ రాజీనామాకు గల్లీ నుండి రాష్ట్రస్థాయి వరకు ఆందోళనలు
- నేనేం చేశానో.. అసెంబ్లీలో చెబుతా
- ఆక్రమణలు తొలగిస్తున్నాం తప్ప.. వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు కట్టుకోలే
- సీఎం రేవంత్ రెడి పిలుపు

**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఘాటైన వ్యాఖ్యలతో తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్‌కు.. నాకు పోలిక ఏంటి? అంటూ సీఎం ఫైర్ అయ్యారు. కేసీఆర్ సీఎం అయితే ఆయన కుటుంబ సభ్యులకు, బంధువులకు పదవులు కట్టబెట్టారని విమర్శించారు. తాను సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పదవులు ఇచ్చామని చెప్పుకొచ్చారు. దేశంలోనే ప్రధాన ప్రతిపక్ష

మిగతా 2వ పేజీలో



# మేడమ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ జాడెక్కడ...!

### కమిషనర్ ఆదేశాలు కాగితాలకే పరిమితమా...!

- సర్వే నంబర్లు 11/33, 11/34లలో ప్రభుత్వ భూముల పరిరక్షణ గాలికొదిలేసినట్లేనా...!
- కూల్చివేతలు జరపాలంటూ జారీ చేసిన ఆదేశాలు అటకెక్కినట్లేనా...!
- సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్న అక్రమార్కులు, అధికారులు...!
- అంజయ్యనగర్ అక్రమ నిర్మాణాలతో కాలం వెల్లదీస్తున్న అధికార యంత్రాంగం...!
- ఆ బహుళ అంతస్తుల నిర్మాణం కూల్చాలంటే 'బాహుబలి' యంత్రం కావాలంటున్న మాదాపూర్ డిప్యూటీ కమిషనర్...!
- అక్రమ నిర్మాణాల వెనుక ఉన్న 'షాడో లీడర్' ఎవరు...!
- హైడ్రా, మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో కూల్చివేతలు జరిగేనా...!
- ముఖ్యమంత్రి శాఖలోనే తాండవిస్తున్న అవినీతి, అక్రమాలు...!

### ఖానామెట్ అక్రమ నిర్మాణాలను కూల్చేదెన్నడు...!

ఖానామెట్ అక్రమ నిర్మాణాలను కూల్చేందుకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు ఆదేశాలు జారీ చేశామంటూ సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డా. సృజన పేర్కొన్నప్పటికీ, 15 రోజులు గడుస్తున్నా ఆ దిశగా నేటికీ కూల్చివేతలు జరపకపోవడంపై స్థానికంగా తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కమిషనర్ ఆదేశాలు కాగితాలకే పరిమితమా, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ జాడెక్కడ అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.ఖానామెట్ ప్రభుత్వ సర్వే నంబర్లు 11/33, 11/34లలో 4 వేల చదరపు గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి, వంద కోట్ల విలువైన భూమిలో 7 అంతస్తుల నిర్మాణాలు యథేచ్ఛగా సాగిస్తుంటే, ఆదిలోనే కట్టడి చేయాల్సిన రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రభుత్వ భూముల పరిరక్షణను గాలికొదిలేసి అక్రమార్కులకు వంత పాడుతున్నారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కూల్చివేతలు జరపాలంటూ జారీ చేసిన ఆదేశాలు అటకెక్కినట్లేనా అని స్థానికులు మండిపడుతున్నారు. ఇటీవల అంజయ్యనగర్‌లో కూలిన 7 అంతస్తుల అక్రమ నిర్మాణంతో నిద్రమత్తు వీడిన అధికార యంత్రాంగం హడావుడి చేస్తూ కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఆదిలోనే అక్రమ నిర్మాణాలను అడ్డుకుని కూల్చివేతలు జరపాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు, ఆ బహుళ అంతస్తుల నిర్మాణం కూల్చాలంటే 'బాహుబలి' యంత్రం కావాలంటూ మాదాపూర్ డిప్యూటీ కమిషనర్ పేర్కొనగా, ఆ యంత్రం హైడ్రా వద్ద అందుబాటులో ఉన్నప్పటికీ కూల్చివేతలు చేపట్టక పోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పుట్టగొడుగుల్లా వెలిసిన వందలాది అక్రమ నిర్మాణాలను ఒక్క బాహుబలి యంత్రంతో ఎన్ని సంవత్సరాల పాటు కూలుస్తారో చెప్పాలంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.


మిగతా 2వ పేజీలో




## ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూకబ్జాలపై భగ్గుమన్న కౌన్సిలర్లు

- విచారణ జరిపించాలని డిమాండ్
- ఆ తర్వాతనే కోఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వహించాలి
- పోడియం వద్ద కాంగ్రెస్ బీఆర్ఎస్ ఎంఐఎం కౌన్సిలర్ల నినాదాలు
- సభ జరిగే అవకాశం లేక పోవడంతో వాయిదా వేస్తున్నట్టు మున్సిపల్ చైర్ పర్సన్ వెల్లడి

03



### ప్రధాని మోదీతో ఇరాన్ అధ్యక్షుడు భేటీ
- ఇరాన్ -అమెరికా వివాద పరిష్కారానికి చొరవచూపాలని రిక్వెస్ట్

02



### ఖైరతాబాద్‌లో బీఆర్ఎస్ 'సమస్యలపై సమరం

02

- ఎర్రమంజిల్ డివిజన్ ద్వారకాపురి కాలనీలో ఉద్రిక్తతల మధ్య పాదయాత్ర
- పాల్గొన్న ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి

## ప్రశాంత్ రెడ్డీ.. నిన్ను వదల

- తండ్రీనీ కూతురిని విడదీసిన పాపం ఆయనదే
- గంజాయి పైసలతో గెలిచావ్.. వెంటపడి ఓడిస్తా
- నిజామాబాద్ పాంచజన్యసభలో కవిత సంచలన కామెంట్స్
- కుట్రలతో తనను తీహార్ జైలుకు పంపారంటూ భావోద్వేగంతో కన్నీళ్ళు

02





# మేడమ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ జాడెక్కడ...!



## మహా, స్టేట్ బ్యూరో చీఫ్:

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసీ), శేరిలింగంపల్లి మండలం, కూకట్పల్లి జోన్, హైటెక్ సిటీ కూకట్పల్లి ప్రధాన రహదారిని ఆనుకుని బుట్టా కన్వెన్షన్ పక్కన వంద కోట్ల విలువైన ప్రభుత్వ భూమిలో సర్వే నంబర్లు 11/33, 11/34 లలో సుమారు 4 వేల చదరపు గజాలలో వెలిసిన అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు, టాస్క్‌ఫోర్స్ విభాగం వ్యవహరిస్తున్న తీరుపై స్థానికంగా తీవ్ర దుమారం రేగుతోంది. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డా. జి. సృజన అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేయాలంటూ స్పెషల్ టాస్క్ ఫోర్స్ కు జారీ చేసిన ఆదేశాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయంటూ తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## అంజయ్యనగర్ ఘటనతో బయటపడిన వాస్తవాలు:

ఇటీవల గచ్చిబౌలి పరిధిలోని అంజయ్యనగర్‌లో కేవలం 50 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన ఏడు అంతస్తుల అక్రమ భవనం కుప్పకూలి ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ విషాద ఘటనపై స్పందించిన సిఎంసీ కమిషనర్ జి. సృజన, విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన మాదాపూర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారిపై సస్పెన్షన్ వేటు వేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా అంజయ్యనగర్ పరిధిలోని మిగిలిన అక్రమ నిర్మాణాలను గుర్తించి, అవసరమైన కూల్చివేత చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.అయితే ఖానామెట్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై కూల్చివేత చర్యలు చేపట్టాలని స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు ఆదేశాలు జారీ చేసి దాదాపు పదిహేను రోజులు గడుస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నా, సంబంధిత శాఖలు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.అంజయ్యనగర్‌లో ప్రమాదం జరిగిన తర్వాత మాత్రమే అధికారులు అప్రమత్తమయ్యారని, మరి ఖానామెట్ లో కూడా అలాంటి ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు ప్రారంభ దశలోనే అడ్డుకోవాల్సిన అధికారులు, ప్రమాదాలు జరిగిన తర్వాత హడావుడిగా చర్యలు చేపట్టడం వల్ల ప్రాణనష్టం జరిగినా బాధ్యత ఎవరు వహిస్తారని నిలదీస్తున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ, అక్రమ నిర్మాణాల నియంత్రణ విషయంలో అధికారులు ప్రాంతాల వారీగా వేర్వేరు ప్రమాణాలు పాటిస్తున్నారా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అంజయ్యనగర్‌లో చూపుతున్న చొరవనే ఖానామెట్ లోనూ ప్రదర్శించి, స్పెషల్







టాస్క్‌ఫోర్స్‌ను వెంటనే రంగంలోకి దింపి అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

"ప్రమాదాలు జరిగి అమాయక ప్రజలు చస్తే గాని స్పందిస్తారా..? లేక ముందస్తుగా చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలు, ప్రభుత్వ ఆస్తులను కాపాడతారా..?" అన్న ప్రశ్న ఇప్పుడు ఖానామెట్ ప్రజల నుంచి అధికార యంత్రాంగానికి ఎదురవుతోంది.

## అక్రమ కట్టడాల వెనుక ఉన్న ఆ 'షాడో లీడర్' ఎవరు..

ఖానామెట్ లోని అక్రమ నిర్మాణాల వెనుక అధికార పార్టీకి చెందిన ఒక 'షాడో లీడర్' ఉన్నట్లు మున్సిపల్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. సదరు లీడర్ కనుసన్నల్లోనే టౌన్ ప్లానింగ్ అధికారులు కళ్ళు మూసుకుంటున్నారని, హైకోర్టు లేదా మున్సిపల్ నోటీసులు రాగానే కంటితుడుపుగా ఒకటో రెండో పిల్లర్లను పగులగొట్టి, ఆ తర్వాత లోపాయికారీ ఒప్పందాలతో వ్యవహారాన్ని సర్దుమణిగిస్తున్నారని సమాచారం. ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్న మున్సిపల్ శాఖలోనే, అదీ ఐటీ కారిడార్ ముఖద్వారం వద్ద ఈ స్థాయిలో అవినీతి తాండవిస్తుండటం ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగి







స్తోందని స్థానికులు వాపోతున్నారు .

## బాహుబలి' సాకులు వెతుకుతున్న డిప్యూటీ కమిషనర్..!

ఖానామేట్ పరిధిలో వెలిసిన భారీ అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవడంలో మాదాపూర్ డిప్యూటీ కమిషనర్ వింత సాకులు చెబుతుండటం గమనార్హం. సదరు బహుళ అంతస్తుల నిర్మాణాన్ని కూల్చాలంటే తమ వద్ద ఉన్న యంత్రాలు సరిపోవని, దానికి పెద్ద 'బాహుబలి' యంత్రం కావాలంటూ కాలయాపన చేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అంతస్తులపై అంతస్తులు లేస్తుంటే అప్పుడు నిద్రపోయిన అధికారులు, ఇప్పుడు కూల్చమంటే సాకులు వెతకడం వెనుక ఉన్న మతలబు ఏమిటనేది బహిరంగ రహస్యమేనని తేటతెల్లమవుతుంది .

## హైడ్రా బుల్డోజర్లు రంగంలోకి దిగేనా..

గతంలో ఖానామెట్ పరిధిలోని రూ.1,200 కోట్ల విలువైన 8 ఎకరాల ప్రభుత్వ భూమిని, అలాగే మెటల్ చార్మినార్ రోడ్డులోని రూ.1,000 కోట్ల విలువైన 5 ఎకరాల స్థలాన్ని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆధ్వర్యంలో అధికారులు స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ వేశారు. అయితే, కేవలం ఖాళీ




స్థలాలను స్వాధీనం చేసుకోవడమే కాకుండా, సర్వే నంబర్లు 11/33, 11/34 లలో కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలపై కూడా హైడ్రా, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా బుల్డోజర్లతో ఉక్కుపాదం మోపాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక అధికారుల 'బాహుబలి' సాకులను పక్కనపెట్టి, హైడ్రా రంగంలోకి దిగితేనే ఈ అక్రమ కట్టడాలు కూలుతాయని, ప్రభుత్వ భూములకు రక్షణ దొరుకుతుందని క్షేత్రస్థాయి పరిశీలనలో తేలుతోంది. మరి ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యాక్షన్ ప్లాన్ మొదలుపెడతారా.. లేక అక్రమార్కుల నీడలోనే కాలం వెల్లదీస్తారా అనేది వేచి చూడాలి.










# మెస్సి సంచలన నిర్ణయం


## .. ఫుట్‌బాల్‌కు గుడ్‌బై

**మహా :** అర్జెంటీనా స్టార్ ఫుట్ బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సి సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. నేటితరం ఫుట్ బాల్ దిగ్గజంగా పేరొందిన మెస్సి సోమవారం తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. మెస్సి తన అంతర్జాతీయ ఫుట్‌బాల్ కెరీర్‌లో 207 మ్యాచ్‌లాడి 125 గోల్స్ సాధించాడు. ఇంటర్నేషనల్ ఫుట్ బాల్ ఆల్ టైమ్ గోల్ స్కోరర్స్ జాబితాలో మెస్సి రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇటీవలే జరిగిన ఫిఫా ప్రపంచకప్ 2026లో అర్జెంటీనా రన్నరప్‌గా నిలిచింది. స్పెయిన్ చేతిలో 10 తేడాతో మెస్సి సారథ్యంలోని అర్జెంటీనా ఓడింది. గతంలో అర్జెంటీనాకు 2022 ఫిఫా ప్రపంచ కప్, 2021, 2024 రెండు కోపా అమెరికా టైటిళ్లను మెస్సి అందించాడు. ఫిఫా ప్రపంచ కప్ ఫైనల్‌లో ఓడిన నాటి నుంచే మెస్సీ అంతర్జాతీయ రిటైర్మెంట్‌పై ఊహాగానాలు వ్యక్తమయ్యాయి. అయితే మెస్సి మాత్రం వచ్చే ఫిఫా వరల్డ్‌కప్ వరకు ఆడకపోయినప్పటికీ, కొంతకాలం పాటు జట్టు తరఫున ఆడాలని తొలుత భావించాడు. కానీ తన రిటైర్మెంట్‌కు ఇదే సరైన సమయమని భావించిన మెస్సీ సోమవారం అకస్మాత్తుగా తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. మెస్సీకి భారత్ లో భారీగా అభిమానులున్నారు. హైదరాబాద్ వచ్చిన మెస్సీ సీఎం రేవంత్ తో కలిసి ఫుట్ బాల్ ఆడారు.

# కేరాఫ్ హస్తిన నేడు ఢిల్లీకి సీఎం

- **రెండు, మూడురోజులు హాట్ డిస్కషన్స్**

**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం ఢిల్లీలో తుమ్మిడిహట్టిపై జరిగే కీలకసమావేశానికి హాజరుకానున్నారు. విదేశీపర్యటన ముగించుకుని వచ్చిన ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ తో భేటీ కానున్నారు. పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కూడా ఢిల్లీలో మకాం వేయనున్నారు. కొండాసురేఖ, చిన్నారెడ్డిలపై క్రమశిక్షణా కమిటీ నివేదిక నేపథ్యంలో నేతలు చర్చించనున్నారు. ఈ సందర్భంగా మంత్రివర్గ విస్తరణ, శాఖల మార్పుపైనా చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది.



# ప్రధాని మోదీతో ఇరాన్ అధ్యక్షుడు భేటీ

- **ఇరాన్-అమెరికా వివాద పరిష్కారానికి చొరవచూపాలని రిక్వెస్ట్**

**ఢిల్లీ, మహా :** అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్న ఇరాన్అమెరికా వివాదం పరిష్కారానికి భారత్ చొరవ చూపాలని ఇరాన్ నాయకత్వం అభ్యర్థించింది. కిర్గిజ్‌స్థాన్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత్ తనకున్న దౌత్యపరమైన సంబంధాలను ఉపయోగించాలని ఆయన మోదీని కోరారు. ఈ సందర్భంగా పెజెష్కియాన్ మాట్లాడుతూ.. కష్టకాలంలో తమకు అండగా నిలుస్తున్నందుకు భారత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అమెరికా దౌత్య మార్గాన్ని విడనాడి యుద్ధ మార్గాన్ని ఎంచుకుందని, ఆ దేశంలోని కొన్ని శక్తులు ఈ వివాదం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. చర్చలు, పరస్పర సహకారంతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్న ఆయన, ఇతర దేశాలు యుద్ధం వైపు వెళ్లకుండా నిరోధించేందుకు భారత్ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రధానమంత్రి మోదీ స్పందిస్తూ, క్లిష్ట పరిస్థితుల్లోనూ ఇరాన్‌తో భారత్ తన దృఢమైన సంబంధాలను కొనసాగించిందని గుర్తుచేశారు. పెజెష్కియాన్‌ను శాంతికాముకుడిగా అభివర్ణించిన మోదీ, శాంతి స్థాపనలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. కొందరు యుద్ధం ద్వారా లబ్ధి పొందాలని చూస్తారన్న విషయాన్ని అంగీకరిస్తూనే, శాంతిభద్రతల పరిరక్షణ కోసం చేసే ప్రయత్నాలను ముమ్మరం చేయాలని, తుదకు శాంతే విజయం సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# కేసీఆర్ రాజీనామాకు సీఎం డిమాండ్



(మొదటి పేజీ తరువాయి)

నేత వైఫల్యం చెందిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వ్యాఖ్యానించారు. 'పదేళ్లలో మీరు ఏం చేశారో.. రెండున్నరేళ్లలో మేం ఏం చేశామో అసెంబ్లీకి చర్చకు సిద్ధం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం ముసారాంబాగ్ హైలెవెల్ బ్రిడ్జిని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలపై తీవ్ర విమర్శలు చేశారు. 'కేసీఆర్‌కు.. నాకు పోలిక ఏంటి..? కేసీఆర్ సీఎం అయితే ఆయన కుటుంబ సభ్యులు, బంధువులకు పదవులు కట్టబెట్టారు. నేను సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పదవులు ఇచ్చాం. దేశంలోనే ప్రధాన ప్రతిపక్ష నేత వైఫల్యం చెందిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. పదేళ్లలో మీరు ఏం చేశారో.. రెండున్నరేళ్లలో.. మేం ఏం చేశామో అసెంబ్లీలో చర్చకు సిద్ధం. ఈ వెయ్యి రోజుల్లో జనం కోసం కేసీఆర్ ఒక్కసారైనా బయటకు వచ్చారా? ఈ వెయ్యి రోజుల్లో ప్రధాన ప్రతిపక్ష నేత రూ.22.24 కోట్ల ప్రభుత్వ వేతనం తీసుకున్నారు. రేపటి నుంచి 6 రోజులపాటు ప్రధాన ప్రతిపక్ష నేత రాజీనామా చేయాలంటూ ఆందోళనలు చేయాలి.' అని ప్రతిపక్ష నేతపై సీఎం రేవంత్ ఘాటైన విమర్శలు చేశారు.

**ప్రణాళికాబద్ధంగా హైదరాబాద్ అభివృద్ధి..**

హైదరాబాద్ అతివేగంగా విస్తరిస్తోందని.. ఈ మహానగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ విశ్వనగరంగా మారిందని.. ప్రపంచంతో హైదరాబాద్ పోటీ పడుతోందన్నారు సీఎం. వివిధ రంగాలకు హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందన్నారు. మౌలిక వసతుల విస్తరణ కూడా అవసరం అని పేర్కొన్న సీఎం.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల విస్తరణ జరగడం లేదన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని సీఎం చెప్పారు.

**మూడు భాగాలుగా తెలంగాణ..**

అభివృద్ధి కోసం తెలంగాణను 3 భాగాలుగా విభజించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ పక్కన నివసించేవారి పరిస్థితి అత్యంత దయనీయం అని.. మూసీకి వరదలు వస్తే ప్రజలు ఎంతో నష్టపోతున్నారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ముసారాంబాగ్ వంతెనను ఎందుకు నిర్మించలేదని సీఎం రేవంత్ ప్రశ్నించారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత రెండేళ్లలోనే బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు. పదేళ్లలో అంబర్‌పేట్ లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టారా? అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. ఎక్కడో ఊరి బయట డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టారంటూ విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోలేదని సీఎం రేవంత్ ఆరోపించారు. పేదల కష్టాలు తమకు తెలుసునని.. అందుకే ఇళ్లు కట్టిస్తున్నామని సీఎం అన్నారు. బతుకమ్మకుంటను చెరబట్టింది ఎవరో అందరికీ తెలుసునని బీఆర్ఎస్ నేతలనుద్దేశించి ఆరోపణలు గుప్పించారు సీఎం. బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు చెరువు లేకుండా.. బతుకమ్మకుంటను కబ్జా చేశారన్నారు. హైడ్రాను పంపి బతుకమ్మకుంట చెర విడిపించామని చెప్పారు. ఆడబిడ్డలకు బతుకమ్మకుంటను బహుమతిగా ఇచ్చామన్నారు. మళ్లీ బతుకమ్మకుంట కబ్జాకు యత్నిస్తున్నారంటూ సీఎం ఆరోపించారు. చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నాం తప్ప.. వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు తాము కట్టుకోలేదన్నారు.

**1000 రోజుల ప్రజాపాలన..**

ప్రజాపాలన ఏర్పడి 1000 రోజులు పూర్తయ్యాయని సీఎం రేవంత్ తెలిపారు. ప్రజా ప్రభుత్వంపై బురద జల్లాలను కుట్రలు చేస్తున్నారంటూ విపక్షాలపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం విఫలమైందని కొందరు విమర్శిస్తున్నారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూసి ఆశ్చర్యపోయామన్నారు సీఎం. ధనిక రాష్ట్రంగా తెలంగాణను కేసీఆర్‌కు అప్పగిస్తే.. అప్పులకుప్ప చేశారంటూ విమర్శలు గుప్పించారు. పదేళ్లలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. కేసీఆర్‌కు ముందు ఉన్న సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు కాగా.. కేసీఆర్ ఒక్కరే రూ.7.50 లక్షల కోట్ల అప్పు చేశారన్నారు సీఎం రేవంత్. ఈ అప్పుల కోసం నెలకు రూ.7,500 కోట్ల అసలు, వడ్డీ కడుతున్నామని వివరించారు. ఏడాదికి రూ.8090 వేల కోట్ల అప్పు కడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

**నాడు విధ్వంసం.. నేడు వికాసం**

విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపిస్తున్నామన్నారు సీఎం రేవంత్. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని.. రెండేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారాయన. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం.. ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు కట్టామన్నారు. రైతుల కోసం రూ.లక్షా 70 వేల కోట్లు ఖర్చు చేశామని సీఎం వెల్లడించారు. తమది ప్రజా ప్రభుత్వం.. ప్రజాపాలన అంటే ఇదే అని పేర్కొన్నారు. తాము అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలు ఆలోచించాలని సీఎం రేవంత్ కోరారు. 3 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు. పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తున్నామన్నారు. కేసీఆర్ ఏనాడైనా రేషన్ కార్డుల గురించి ఆలోచన చేశారా? అని ప్రశ్నించారు. అల్వాల్ టిమ్స్‌కు మాజీ సీఎం అంజయ్య పేరు పెడతామని సీఎం ప్రకటించారు. వరంగల్ టిమ్స్‌కు ప్రొ. జయశంకర్ పేరు పెడతామన్నారు. ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెడతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు,. ఎంపీ అనిల్ యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, మల్ రెడ్డి రంగారెడ్డి, కీలక నేతలు మధుయాష్కీగౌడ్, పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత్ రెడ్డీ.. నిన్ను వదల

**నిజామాబాద్, మహా :** మహాభారతంలో శకుని ఎలాంటి పాత్ర పోషించాడో, మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి కూడా తెలంగాణ రాజకీయాల్లో అలాగే వ్యవహరించారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. తమ ఇంట్లోనే కూర్చొని అన్నం తిన్న ప్రశాంత్ రెడ్డి, తండ్రీకూతుళ్లయిన కేసీఆర్‌తన మధ్య విబేధాలు సృష్టించి విడదీశారని ఆవేదన వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) అధినేత్రి కల్వకుంట్ల కవిత నిజామాబాద్ లో నిర్వహించిన పాంచజన్య బహిరంగ సభలో తీవ్ర భావోద్వేగానికి లోనై కన్నీరు పెట్టుకున్నారు. బీఆర్ఎస్ మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి లక్ష్యంగా ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. నన్ను నా తండ్రి నుంచి వేరు చేసిన పాపాత్ముడు ప్రశాంత్ రెడ్డి అని తీవ్రంగా విమర్శించారు. సంతోష్ రావు, హరీశ్ రావులను అయినా క్షమిస్తానేమో గానీ, ప్రశాంత్ రెడ్డిని మాత్రం ఎప్పటికీ క్షమించనని స్పష్టం చేశారు. ఆయనకు ఇక ప్రజాజీవితం లేదని, రాబోయే ఎన్నికల్లో ఎక్కడ పోటీ చేసినా వెంటపడి మరీ ఓడిస్తానని హెచ్చరించారు. ప్రశాంత్ రెడ్డి గవర్నమెంట్ పోయిన వెంటనే కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేశారని, గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తన రాజకీయ ఎదుగుదలను అణగదొక్కేందుకు కుట్రలు చేశారని ఆరోపించారు. గంజాయి పైసలతో ఓటుకు 30వేలిచ్చి ముక్కి మూలిగి, 3వేల ఓట్లతో గెలిచాడని, గెలిచిన వెంటనే ముకుందరెడ్డి ద్వారా కాంగ్రెస్ లోకి వెళ్ళే ప్రయత్నం చేశాడన్నారు. రానున్న రోజుల్లో నిజామాబాద్ జిల్లాలోని 5 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేసిన కవిత, ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తానని ప్రకటించారు.

# ప్రజావాణిలో రెవెన్యూ ఫిర్యాదులే ఎక్కువ

**ఆరు అర్జీల స్వీకరణ.. సంబంధిత అధికారులకు పంపిస్తాం: ఎంపీడీవో**

**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ మండలంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆరు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో జి. మున్ని తెలిపారు. భూ రికార్డుల సవరణ, ఇంటి నిర్మాణ అనుమతులు, ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు, అక్రమ ఇంటి నంబర్ల కేటాయింపు, నాలా కన్వర్షన్ రద్దు, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ తదితర అంశాలపై ప్రజలు ఫిర్యాదులు సమర్పించారు.పెద్దతూప్రకు చెందిన సర్పంచ్ బీక్య నాయక్ సర్వే నంబర్లు 107, 117లో భూ రికార్డులు సరిచేయాలని కోరగా, పెద్ద షాపూర్ తండాకు చెందిన సరస్వతి ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని వినతిపత్రం అందించారు. ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని కె. చక్రధర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. చౌదర్‌గూడలో నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నంబర్లు కేటాయిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజాప్రతినిధులు కోరారు.ఘాన్సీమియాగూడ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని ఎం. రవీందర్ గౌడ్ కోరారు. అయితే కోర్టు వివాదం కారణంగా సర్వే నంబర్లు 3, 4లోని భూములకు ఇతరులకు పాస్ పుస్తకాలు జారీ చేయలేమని తహసీల్దార్ కే. అమరలింగం గౌడ్ తెలిపారు. ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తామని ఎంపీడీవో తెలిపారు.




# ఖైరతాబాద్‌లో బీఆర్ఎస్ 'సమస్యలపై సమరం

- **ఎర్రమంజిల్ డివిజన్ ద్వారకాపురి కాలనీలో ఉద్రిక్తతల మధ్య పాదయాత్ర**
- **పాల్గొన్న ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి**

**ఖైరతాబాద్, మహా** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గం, ఎర్రమంజిల్ డివిజన్ పరిధిలోని ద్వారకాపురి కాలనీలో ఈరోజు ఉదయం బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు నిశాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సమస్యలపై సమరం పాదయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ పాదయాత్రలో ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి శ్రీ మన్నె గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, కాలనీలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలపై స్థానికులతో నేరుగా మాట్లాడి తెలుసుకున్నారు. ద్వారకాపురి కాలనీలో విపరీతంగా పేరుకుపోయిన చెత్తాచెదారం, అస్తవ్యస్తంగా మారిన



శానిటేషన్ సమస్యలు, వెలగని జీహెచ్ఎంసీ స్ట్రీట్ లైట్ల వైఫల్యంపై స్థానికులు నాయకుల దృష్టికి తెచ్చారు. ఈ సమస్యలపై వెంటనే స్పందించిన మన్నె గోవర్ధన్ రెడ్డి.. అక్కడికక్కడే జీహెచ్ఎంసీ అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణమే క్లీనింగ్ పనులు చేపట్టాలని ఆదేశించారు. స్పందించిన అధికారులు ఉదయం కల్లా పనులన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

**ప్రమాదకర విద్యుత్ వైర్లు, రోడ్ల దుస్థితిపై చర్యలు**

నాగార్జున సర్కిల్ ఫ్లవర్ షాపుల సమీపంలో అత్యంత ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లు, ఓపెన్‌గా ఉన్న ఎలక్ట్రికల్ బాక్సుల వల్ల ఎప్పు ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని వెంటనే బంజారాహిల్స్ ఎలక్ట్రికల్ ఏఈ దృష్టికి తీసుకెళ్లి తక్షణమే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఇటు రోడ్ల దెబ్బతిన్న వైనంపై ఏఈ భరత్‌తో మాట్లాడి త్వరగా రోడ్డు వేయాలని కోరారు. స్పందించిన అధికారులు ఒకటి రెండు రోజుల్లోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా.. నిత్యం ప్రజల వెంటే ఉంటూ వారి ఇబ్బందులను పరిష్కరించడమే మా లక్ష్యం అని ఈ సందర్భంగా ఎంజీఆర్ స్పష్టం చేశారు. ఈ పాదయాత్ర కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బిట్ల శ్రీనివాస్ రాజు, ద్వారకాపురి కాలనీ ప్రెసిడెంట్ రవి కిషోర్, రాజేష్ యాదవ్, అజీజ్, చోటు, భరత్, రవి, విజయ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమ విజయవంతానికి కృషి చేశారు.

# 22ఏ భూములపై ఆధారాలతోనే నిర్ణయాలు

- **వేట్ భూములు పొరపాటున జాబితాలో ఉంటే 48 గంటల్లో పరిష్కరించాలి**
- **ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీ వద్దు: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి, మహా,:** 22ఏ నిషేధిత భూములకు సంబంధించిన వ్యవహారాల్లో పూర్తి ఆధారాలు, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రెవెన్యూ అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి 22ఏ నిషేధిత భూముల జాబితాపై రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 22ఏ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు అందుతున్న ఫిర్యాదులు, భూముల రికార్డుల పరిశీలన, నిషేధిత జాబితాలో భూములను చేర్చడం, తొలగించే ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏదైనా ప్రైవేట్ భూమి పొరపాటున 22ఏ నిషేధిత జాబితాలో నమోదైనట్లు నిర్ధారణ అయితే, సంబంధిత సర్వే నంబర్ వారీగా డిలీటెడ్ లిస్ట్ రూపొందించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. 22ఏ జాబితాలో భూములను చేర్చేటప్పుడు అనుసరించే విధానాన్నే తొలగింపు ప్రక్రియలోనూ పాటించాలని స్పష్టం చేశారు.తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు నిర్దిష్ట కారణాలు, స్పష్టమైన రిమార్క్స్ తప్పనిసరిగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. నిజమైన ప్రైవేట్ భూములకు సంబంధించిన సమస్యలను ఆలస్యం చేయకుండా వేగంగా పరిష్కరించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 22ఏ సమస్యల పరిష్కారంలో పారదర్శకత పాటించాలని తెలిపారు.అదే సమయంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. 22ఏ భూములకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు సమన్వయంతో పనిచేసి, అందుబాటులో ఉన్న అన్ని రికార్డులు, ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే తుది నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు.22ఏ భూముల పరిశీలన, జాబితా నుంచి తొలగింపు ప్రక్రియకు జిల్లా వ్యాప్తంగా ఒకే విధమైన ఫార్మాట్‌ను రూపొందించాలని అధికారులకు సూచించారు.సమావేశంలో ఆర్డీఓ గంగయ్య, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధరణి కంటే దరిద్రంగా 'భూభారతి

**సిద్దిపేట, మహా :** రాష్ట్రంలో రైతుల భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మండిపడ్డారు. 22ఏ నిషేధిత జాబితా వల్ల ప్రజలు పడుతున్న గోసను నిరసిస్తూ సిద్దిపేటలో ఎంపీ రఘునందన్ రావుతో కలిసి సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రైతు భరోసా రూ. 12 వేలు కాదు రూ. 15 వేలు ఇస్తామని, కౌలు రైతులకు కూడా రైతు బంధు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని గాలికొదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అత్యధిక ఆత్మహత్యలు కౌలు రైతులవేనని తెలిపారు. మరోవైపు సాధారణ రైతులు తమ భూమిని కాపాడుకోలేక, నాది అని చెప్పుకోలేక, అమ్ముకోలేక, బ్యాంకుల్లో పెట్టి రుణం కూడా తీసుకోలేక తీవ్రమైన వేదనకు గురవుతున్నారన్నారు.గత ప్రభుత్వం 'ధరణి' పేరుతో రైతులను కష్టాల పాలు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం తెచ్చిన 'భూభారతి' పాతదానికంటే దరిద్రంగా మారిందని రాంచందర్ రావు విమర్శించారు. ప్రభుత్వం తీసుకున్న అర్థం లేని, అనాలోచిత విధానాల వల్ల మల్కాజ్‌గిరి, చేవెళ్ల, సిద్దిపేట లాంటి నగరాల్లో లక్షలాది ఎకరాలు, ప్లాట్లు 22ఏ నిషేధిత జాబితాలోకి వెళ్లిపోయాయని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 లక్షల మంది దీనివల్ల నరకం చూస్తున్నారని అన్నారు. పిల్లల చదువులు, ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం అవసరానికి భూమి అమ్ముకోలేక కుటుంబాలు తీవ్ర భయాందోళనలతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నాయన్నారు. తప్పు జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్వయంగా ఒప్పుకున్నారని, మరి అలాంటప్పుడు ఆ తప్పును సరిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాదా అని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ అండ్ ఫ్యామిలీ, ఇప్పుడు రేవంత్ రెడ్డి అండ్ బ్రదర్స్ టైటిల్ మాత్రమే మారింది తప్ప తెలంగాణ ప్రజల సమస్యలు తీరలేదని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి పరిపాలన కంటే రియల్ ఎస్టేట్ మీదే ఎక్కువ అనుభవం, ఆసక్తి ఉందని రామచంద్రరావు ఆరోపించారు. భూముల్లో వివాదాలు సృష్టించి, వాటి ధరలు పడిపోయేలా చేసి, పేదలను భయపెట్టి భూములు లాక్కొని ఎక్కువ ధరలకు అమ్ముకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి వ్యూహమని విమర్శించారు. ప్రభుత్వం చేసిన మానసిక వేధింపులకు ప్రజలకు ఎవరు నష్టపరిహారం ఇస్తారని నిలదీశారు. ప్రభుత్వం వెంటనే 22ఏ లోకి భూములను ఎందుకు చేర్చారో సమగ్ర వివరాలతో కూడిన శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఈ గందరగోళం వెనుక ఉన్న కుట్రలు ఏమిటి, ఎవరికి లాభం చేకూరుస్తున్నారనే దానిపై పూర్తిస్థాయి న్యాయ విచారణ జరిపించాలన్నారు. రైతులకు బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తుందని రాంచందర్ రావు స్పష్టం చేశారు.

# రాహుల్ గాంధీ పై అక్రమ కేసు దుర్మార్గం

- **హనుమకొండ లో కాంగ్రెస్ భారీ నిరసన ధర్నా**
- **డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**

**హనుమకొండ, మహా;** ఏఐసీసీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సూచన మేరకు హనుమకొండ చౌరస్తా లోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వద్ద భారీ ధర్నా, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఛత్తీస్ గఢ్ ప్రభుత్వం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పై అక్రమంగా కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ చేయడాన్ని నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న సభా వేదికను శుద్ధి చేస్తున్నామనే నెపంతో, దళితుడైన ఆయనను తీవ్రంగా అవమానించిన బీజేపీ కార్యకర్తల పై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, దళితులను అవమానించడం వారి అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు.ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, మండల, డివిజన్ అధ్యక్షులు, మీడియా కమిటీ చైర్మన్, అనుబంధ సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థికి ప్రాథమిక విద్యా నైపుణ్యాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించాలి.!

- **ఎఫ్ఎల్ఎన్ అమలుపై ప్రధానోపాధ్యాయులతో సమీక్షలో కలెక్టర్ కోయ శ్రీహర్ష!**

**పెద్దపల్లి, మహా :** ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి విద్యార్థి ప్రాథమిక విద్యా నైపుణ్యాలను సాధించేలా స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని, పక్కా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తొలిమెట్టు కార్యక్రమం అమలు, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)పై సంబంధిత ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గత విద్యా సంవత్సరంలో సాధించిన ఎఫ్ఎల్ఎన్ ఫలితాలు, ప్రస్తుత విద్యా సంవత్సరంలో సాధించాల్సిన లెర్నింగ్ ఔట్‌కమ్స్, విద్యార్థుల ప్రాథమిక నైపుణ్యాల అభివృద్ధి, రెమిడియేషన్ కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడు తనకు నిర్దేశించిన విద్యా లక్ష్యంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి తరగతిలో విద్యార్థులు సాధించాల్సిన ప్రాథమిక నైపుణ్యాలు ఏమిటో స్పష్టంగా నిర్దేశించుకొని, వాటిని సాధించే విధంగా బోధనా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.పెద్దపల్లి జిల్లాలో ప్రస్తుతం ఎఫ్ఆర్ఎస్ 72 శాతంగా ఉందని, దీనిని కనీసం 80 శాతానికి పెంచేలా ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల్లో ఎఫ్ఎల్ఎన్ స్థాయి పెరిగే కొద్దీ ఎఫ్ఆర్ఎస్ కూడా సహజంగానే మరింత మెరుగుపడుతుందని తెలిపారు.గత విద్యా సంవత్సరంలో 4, 5వ తరగతుల విద్యార్థులు ఎఫ్ఎల్ఎన్‌లో మంచి ఫలితాలు సాధించారని, ఈ విద్యా సంవత్సరంలో కూడా అదే ఫలితాలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అదే సమయంలో 2, 3వ తరగతుల విద్యార్థులపై మరింత ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసనలో ప్రారంభ దశలోనే పునాది నైపుణ్యాలను పటిష్టం చేస్తే తదుపరి తరగతుల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థులు సాధించాల్సిన లెర్నింగ్ ఔట్‌కమ్స్‌పై స్పష్టమైన గోల్స్ ఫిక్స్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల ప్రస్తుత అభ్యసన స్థాయిని గుర్తించి, అందుకు అనుగుణంగా పాఠశాల వారీగా విద్యా ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు.ఎఫ్ఎల్ఎన్‌కు అనుబంధంగా తోడుగా ప్రత్యేక రెమిడియేషన్ కార్యక్రమాన్ని కొనసాగించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థుల్లో గుర్తించిన అభ్యసన లోపాలను అధిగమించేందుకు రెమిడియేషన్ తరగతులను 10 వారాల పాటు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులకు సంబంధించి నిర్దేశించిన సిలబస్, లెర్నింగ్ ఔట్‌కమ్స్‌ను క్షుణ్ణంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి ప్రధానోపాధ్యాయుడు తమ పాఠశాలకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని, ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ విద్యా లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కాంప్లెక్స్ సమావేశాల ద్వారా జిల్లా రిసోర్స్ పర్సన్స్ ఉపాధ్యాయులకు అవసరమైన అకడమిక్ మార్గదర్శకత్వం, అవగాహన కల్పించాలని సూచించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి, కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా నాణ్యమైన అకడమిక్ ఫీల్డ్ విజిట్లు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.ఉపాధ్యాయులకు అవసరమైన బోధనా సహకారం అందించడంతో పాటు విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించాలని తెలిపారు.ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు తమ పరిధిలోని ఉపాధ్యాయులతో ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించి నిర్దేశించిన విద్యా లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలో ఎఫ్ఎల్ఎన్, తొలిమెట్టు, రెమిడియేషన్ కార్యక్రమాల అమలులో మెరుగైన ఫలితాలు సాధించి ప్రథమ స్థానంలో నిలిచేలా అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.



# వెలిగొండ.. బంగారుకొండే

( **మొదటి పేజీ తరవాయి** )
వెలిగొండలో 53 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చని వివరించారు. సోమవారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2024లో డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చిందని.. నాటి నుంచి వెనుదిరిగి చూడలేదని తెలిపారు. ప్రధాని మోదీ సహాయం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారంతో ఈ వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించుకున్నామని చెప్పారు.1996లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశానని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు ఆ ప్రాజెక్టు ప్రారంభించి జాతికి అంకితం చేశానని వివరించారు. రైతుల త్యాగం వల్ల లక్షల మంది జీవితాల్లో వెలుగులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన అందరికీ పాదాభివందనం చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. ఇది భగీరథ ప్రయత్నమని తెలిపారు. అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. మార్కాపురం అన్ స్టాపబుల్ అంటూ బాబు నినదించారు. పచ్చకండువా ఊపి ప్రజలను ఉత్సాహపరిచారు. కృష్ణమ్మకు సాష్టాంగనమస్కారం చేశారు. ప్రాజెక్టు పూర్తికి కష్టపడ్డ మంత్రి నిమ్మల రామానాయుడును అభినందించారు.

# ఎమ్మెల్యే పాయల్ శంకర్ భూకబ్జాలపై భగ్గుమన్న మునిసిపల్ కౌన్సిలర్లు

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ మున్సిపల్ కోఆప్షన్ ఎన్నిక వాయిదా పడింది. ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో సభ్యుడు పాయల్ శంకర్ భూకబ్జాలపై విచారణ జరిపించిన తర్వాతనే మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వహించాలని సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్‌తో పాటు పాలక పక్ష కూటమి సభ్యులు పోడియం వద్ద నినాదాలు చేసారు. కౌన్సిలర్లు బయటకు వచ్చి ఎన్నికను బహిష్కరిచారు.దీంతో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష ఎన్నికను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే ఎక్స్ అఫిషియో మెంబర్ గా ఉన్న పాయల్ శంకర్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ అసైండ్ భూములను కబ్జా చేసి తన భార్య పేరుతో ,అల్లుని పేరు మీద కుటుంబ సభ్యుల పేరు మీద, బినామీల పేర్లతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కౌన్సిలర్లు ఆరోపించారు. బట్టి సావర్గం గ్రామ పరిధిలోని ప్రభుత్వ అసైండ్ భూమి సర్వే నంబర్ 72\3 లో తన భార్య పేర 5 కోట్ల రూపాయల విలువ చేసే 15 ప్లాట్లు రిజిస్ట్రేషన్, ఇండస్ట్రియల్ కారిడార్ ప్రతిపాదిత ప్రాంతాలైన భోరజ్ మండలం హత్తిఘాట్ , గూడ రాంపూర్ ,గిమ్మ గ్రామాల పరిధిలో దాదాపు 500 ఎకరాల భూములు ఈడీ కంట్రోల్లో ఉన్నా కూడా వాటిని అమ్మివేసి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. 500 ఎకరాలు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు బంధువులు బినామీలవే అన్నారు.వీటిపై ప్రముఖ పత్రికలలో కథనాలు కూడా వెలువడ్డాయన్నారు. రిమ్స్ వెనకాల 2/3 సర్వే నెంబర్ లో సుమారు 500 కోట్ల రూపాయల ప్రభుత్వ భూమి కబ్జా చేశారని అదేవిధంగా చిలుకూరి లక్ష్మీ గార్డెన్ , రత్న గార్డెన్ మధ్య సుమారు 9 ఎకరాల ఎఫ్టీఎల్ ల్యాండ్ కబ్జాలో అతని ప్రేయం ఉందన్నారు. వీటన్నిటిపైన పూర్తి విచారణ జరిపించిన తర్వాతనే కోఆప్షన్ ఎలక్షన్కు వెళ్లాలని సభ్యులందరూ చైర్పర్సన్ పోడియం వద్దకు వచ్చి గొడవ చేయడం వల్ల సభను మున్సిపల్ చైర్ పర్సన్ వాయిదా వేస్తున్నట్టు తెలిపారు. తదుపరి కార్యాచరణ పై ప్రభుత్వం దృష్టికి పై అధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని అన్నారు.



# గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్**

**వరంగల్, కలెక్టరేట్ మహా;** వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఐఏఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఈ ప్రజావాణికి మొత్తం 136 దరఖాస్తులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు 42, జీడబ్ల్యూఎంసీ కి 26 , హౌసింగ్ శాఖకు 21, డిఆర్డీవో 16, ఇతర శాఖలకు సంబంధించిన 31 దరఖాస్తులు వచ్చాయి.ఈ సందర్భంగా ప్రజావాణిలో రెవెన్యూ, హౌసింగ్, జీడబ్ల్యూఎంసీ డీఆర్డీవో పరిధిలోని సమస్యలకు సంబంధించిన దరఖాస్తులే అధికంగా వచ్చాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ త్వరగా పరిశీలించి,పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీ గణేష్ పేర్కొన్నారు.ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి ఉదయం 10 గంటలకు ప్రారంభమైనదని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా. రాజారెడ్డి, డీఆర్డీవో నాగ పద్మజ ,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ వినతులను సమర్పించారు.

# అంతులేని యుద్ధం కాదు .. యుద్ధానికి ముగింపు కావాలి

**: పుతిన్‌తో మోదీ**
**ఉక్రెయిన్ యుద్ధంపై ముగింపుకు వెళ్ళాలని సందేశం**

**ఢిల్లీ, మహా :** కిర్గిస్థాన్‌లోని బిష్కెక్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ తన దౌత్యపరమైన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. "అంతులేని యుద్ధం నుంచి యుద్ధానికి స్వస్తి పలికే దిశగా అడుగులు వేయాలి" అని ఈ సందర్భంగా పుతిన్‌కు మోదీ సూచించారు. ఈ యుద్ధం వీలైనంత త్వరగా ముగియాలని యావత్ మానవాళి కోరుకుంటోందని ప్రధాని పేర్కొన్నారు. ఈ సంక్షోభ పరిష్కారానికి ఉద్దేశించిన ప్రతి శాంతియుత ప్రయత్నానికి భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. "ఏ సమస్యనైనా శాంతియుత మార్గాల్లోనే పరిష్కరించుకోవాలన్నదే భారత్ నిశ్చితాభిప్రాయం. ఇది సకల మానవాళి శ్రేయస్సుకు అత్యవసరం. యుద్ధం కొనసాగే ప్రతి రోజూ మానవ ప్రగతిని వెనక్కి నెడుతుంది. కాబట్టి దీనికి తక్షణమే ముగింపు పలకాలి" అని మోదీ వివరించారు. గాంధీ, బుద్ధుడు నడయాడిన భారత గడ్డ ఎల్లప్పుడూ శాంతి మార్గాన్నే బోధిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

# నగర ప్రజలకు మరింత నాణ్యమైన, స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

**ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని***
**జిడబ్ల్యుఎంసి కమిషనర్ టి వెంకన్న**

**వరంగల్, కార్పొరేషన్ మహా;** గ్రేటర్ వరంగల్ నగర ప్రజలకు మరింత నాణ్యమైన, స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న సోమవారం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో నిట్ మాజీ ప్రొఫెసర్ పాండురంగారావుతో కలిసి ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా నగరంలో నీటి సరఫరా, నీటి స్వచ్ఛత, నాణ్యత, పరిమాణం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందించేందుకు పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలు, నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడం, నీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడం వంటి అంశాలపై ప్రొఫెసర్ పాండురంగారావు పలు సూచనలు చేశారు. ప్రజలకు మంచి నాణ్యతతో, పూర్తి స్వచ్ఛతతో, అవసరమైన పరిమాణంలో తాగునీటిని అందించేందుకు ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు.ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్, సంతోష్ బాబు, సంజయ్ కుమార్, మాధవి, డీ ఈలు రోజా రాణి, హరి తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

**పాలకుర్తి, 31 మహా పెద్దపల్లి జిల్లా**
రామగుండం నియోజకవర్గంలో పాలకుర్తి మండలంలో పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కొత్త వెలుగులు నింపుతోంది. రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, వారి సతీమణి మనాలి రాజ్ ఠాకూర్ పాలకుర్తి మండలంలోని పాలకుర్తి గ్రామం మరియు ఈసల తక్కలపల్లి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా పలు నూతన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నూతన గృహప్రవేశాలు చేసుకున్న లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించి, వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మనాలి రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ సక్రమంగా అందుతున్నాయని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా నిరుపేదల ఆత్మగౌరవం ఇనుమడించిందని పేర్కొన్నారు. నూతన గృహాల్లో లబ్ధిదారులు కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో కలకాలం సంతోషంగా జీవించాలని మనసారా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కెర శ్రీనివాస్, పాలకుర్తి గ్రామ అధ్యక్షులు మెరుగు అశోక్ గౌడ్ , ఉపాధ్యక్షులు నూగుల గట్టయ్య కాంగ్రెస్ మాజీ ఎంపిటిసి రాజమౌళి సీనియర్ నాయకులు సొంత పూరి కనకయ్య , చిలుగాని రాజేశం స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పెంచాలి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్


**మంచిర్యాల, మహా :** ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పెంచాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి.చందయ్య తో కలిసి కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, సి. ఆర్.పి. లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. తల్లితండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థలపై నమ్మకంతో ప్రభుత్వ పాఠశాలలలో చేరుస్తున్నారని అన్నారు. జిల్లాలో సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రతి రోజు అల్పాహారం అందించడంతో ప్రభుత్వ పాఠశాలలలో హాజరు శాతం తప్పకుండా పెరుగుతుందని తెలిపారు. పిల్లలు అభ్యాసన సామర్థ్యం పెంచే బాధ్యత విద్యాధికారులు, ఉపాధ్యాయులదే అని, త్వరలో జిల్లాలో విద్యార్థుల హాజరు, నేర్చుకునే సామర్థ్యం తదితర అంశాలతో యాప్ ఏర్పాటు చేసి వారాంతపు నివేదికలు సేకరించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు మల్టీ గ్రేడ్/ మల్టీ లెవెల్ టీచింగ్ అమలు చేయాలని,మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తరచూ పాఠశాలను సందర్శించి విద్యార్థుల పోటీతత్వం ఆధారంగా, తరగతుల విభజన, సీటింగ్ పొజిషన్ సక్రమంగా చేయాలని తెలిపారు. పాఠశాల సందర్శన సమయంలో విద్యార్థులతో మాట్లాడాలని, సంబంధిత ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని, సరైన టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ ద్వారా ఎఫ్.ఎల్.ఎన్. శాతాన్ని పెంపొందించాలని తెలిపారు. విద్యార్థులను నిశితంగా పరిశీలించడం, ఉపాధ్యాయులతో విద్యార్థులు సామర్థ్యాల గురించి సమీక్షించడం, తరగతుల ప్రణాళిక పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. సంబంధిత కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ పై అవగాహన కలిగి ఉండాలని, పాఠశాలలను తరచూ సందర్శించాలని తెలిపారు. మౌలిక వసతుల కల్పనలో ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వెంటనే తెలియజేయాలని, అవసరం మేరకు వసతులు కల్పించడం జరుగుతుందని, విద్యార్థుల పఠన శక్తిని వృద్ధి చేసి నేర్చుకునే సామర్థ్యం పెంపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేస్తే చర్యలు

**గ్రీవెన్స్ పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం: బల్దియా కమిషనర్ వెంకన్న**

**వరంగల్, కార్పొరేషన్, మహా:** ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని బల్దియా కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత విభాగాలు సమన్వయంతో నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని అన్నారు. గత వారం స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులను అడిగి తెలుసుకుని, పెండింగ్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జాప్యం జరిగితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.
ప్రజావాణిలో టౌన్ ప్లానింగ్‌కు 27, ఇంజినీరింగ్‌కు 21, హెల్త్ అండ్ శానిటేషన్‌కు 9, రెవెన్యూకు 11, నీటి సరఫరాకు 3, హార్టికల్చర్‌కు ఒక దరఖాస్తు చొప్పున మొత్తం 72 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# మార్కెట్ లో ముందు నాలాల కబ్జాను నివారించాలి

**ప్రజావాణిలో బహుజన సమాజ్ పార్టీ**



**మందమర్రి, మహా :** మందమర్రి మార్కెట్ వ్యాపార సముదాయాల ముందుగల నాళాలను కబ్జా చేసి దానిపై షెడ్లు నిర్మాణం చేసిన పలు నిర్మాణాలను తొలగించాలని బహుజన సమాజ్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మందమర్రి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో బి ఎస్ పి పార్టీ నాయకులు మందమర్రి మార్కెట్ లో సౌకర్యలు అసౌకర్యంగా మారాయని లికిత పూర్వక ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ విషయంపై మందమర్రి మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులకు, విద్యుత్ అధికారులకు పలుమార్లు వినతి పత్రం అందజేసినట్లు చెప్పారు. పట్టణంలో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలు, నాలాల కబ్జాలు విచ్చలవిడిగా పట్టణంలో జరుగుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రజా రవాణాకు ప్రజా ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నందున వాటిని వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షులు గాజుల శంకర్, మందమర్రి మండలం అధ్యక్షులు ఎండి రహీం బాబా తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు

మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్

28-08-2026

మహా ప్రత్యేకం



# సరిగమపలో.. అశ్విని అద్భుత గానమాధుర్యం




- గిరిజన బిడ్డ.. టాలెంట్ కు అనిల్ రావిపూడి ప్రశంసలు
- అనిల్ రావిపూడి, భీమ్స్ సినిమాల్లో ఛాన్స్ లు
- తన గాత్రంతో.. దుమ్మురేపిన అశ్విని
- సోషల్ మీడియాలో వైరల్ గా మారిన సరిగమప వీడియోలు
- మంగ్లీని మించిన టాలెంట్ ఉందంటూ.. వీక్షకుల ప్రశంసలు
- తెలంగాణ బిడ్డకు.. ప్రపంచమంతా జేజేలు

**(మహా ప్రత్యేకం)**
సరిగమపలో.. మొట్టమొదటిసారి పాల్గొన్న అశ్వినిరాథోడ్ తన టాలెంట్ తో వావ్ అనిపించింది. ఇంతకాలం ఈ గాత్రం ఎక్కడుందంటూ దిగ్గజ దర్శకులు ప్రశంసల్లో ముంచెత్తారు. తెలుగు చిత్రపరిశ్రమలో అపజయమెరుగని టాప్ డైరెక్టర్ అనిల్ రావిపూడి, ఎస్పీ శైలజ, అనంతశ్రీరామ్ వంటి వారు జడ్జిలుగా ఉన్న షోలో అశ్విని తన సరిగమలతో షోను ఉర్రూతలూగించింది. షోకే వన్నెతెచ్చింది. జీ తెలుగు విడుదల చేసిన ఆమె వీడియోలు మిలియన్ల వ్యూస్ తో తెలుగురాష్ట్రాలే కాక ప్రపంచవ్యాప్తంగా వైరల్ గా మారాయి. ఉమ్మడి వరంగల్ లోని భూపాలపల్లి జిల్లాలోని మహాముత్తారం మండలం గజరాంపల్లి మారుమూల గ్రామంలో మొదలైన స్వరం.. ఇప్పుడు జాతీయ వేదికలపై దుమ్మురేపుతోంది. భూపాలపల్లి జిల్లాకు చెందిన సింగర్ అశ్వినీ రాథోడ్ అద్భుత గానంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. టెన్త్ వరకు మహదేవ్ పూర్ మండలంలో చదివిని అశ్విని ఇంటర్ భూపాల్ పల్లిలో, డిగ్రీ ఖైరతాబాద్ లో పూర్తిచేశారు. వీ 6లో మూడేళ్ళు, తర్వాత బిగ్ టీవీలో న్యూస్ ప్రజెంటర్ గా మూడేళ్ళు పనిచేసిన అశ్విని సొంత ఛానళ్ళ ద్వారా బంజారా గీతాలు ఆలపించడంతో పాటు నటించి కూడా తన లోని ప్రతిభను చాటారు. గతంలో ఎన్నో విజయవంతమైన పాటలను పాడిన అశ్విని.. ఇపుడు జీతెలుగు సరిగమపతో ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి మన్ననలు అందుకుంటున్నారు. బంజారాలో గిరిజనబిడ్డగా రాయలసీమ ప్రాంతానికి చెందిన మంగ్లీ ఒక ప్రత్యేక ఒరవడి చూపగా, తెలంగాణ ప్రాంతానికి చెందిన అశ్విని అంతకుమించిన ప్రతిభ చూపుతోందంటూ ఈ ప్రాంత ప్రజలు. సంగీత అభిమానులు అభినందనలు కురిపిస్తున్నారు. జీతెలుగు సరిగమపలో ఇప్పటికే ఐదు ఎపిసోడ్స్ షూట్ పూర్తికాగా, అశ్వినికి మంచి భవిష్యత్తు ఉండాలని, సినీ సంగీత పరిశ్రమలో మరిన్ని శిఖరాలు అధిరోహించాలని శ్రేయోభిలాషులు కోరుకుంటున్నారు.









## ప్రజారోగ్య సేవకు అశోక్ రెడ్డి జీవితం అంకితం

- హెల్త్ అసిస్టెంట్ గా మొదలై జిల్లా మాస్ మీడియా అధికారిగా
- పదవీ విరమణ పొందిన అశోక్ రెడ్డికి అభినందనల వెల్లువ



**హన్మకొండ, మహా ;**ప్రజారోగ్యమే పరమావధిగా భావించి వైద్యారోగ్యశాఖ లో దశాబ్దాలపాటు అంకితభావంతో సేవలందించిన వరంగల్ జిల్లా మాస్ మీడియా అధికారి వేముల అశోక్ రెడ్డి సేవలు అభినందనీయమని హనుమకొండ డిఎంహెచ్వో అప్పయ్య కొనియాడారు. సోమవారం మాస్ మీడియా అధికారి వేముల అశోక్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమం హనుమకొండ ఓ ప్రైవేట్ హాల్లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హనుమకొండ డిఎంహెచ్వో అప్పయ్య మాట్లాడుతూ 1986లో ఆరోగ్య సహాయకుడిగా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన వస్తాను ప్రజలతో నేరుగా మమేకమై ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణ, ప్రభుత్వ వైద్య సేవలు, ప్రజారోగ్య కార్యక్రమాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్య విద్యావేత్తగా, ఉప జిల్లా మాస్ మీడియా అధికారిగా, ఆరోగ్య విద్యా విస్తరణ అధికారిగా వివిధ బాధ్యతలు నిర్వర్తించి, చివరకు వరంగల్ జిల్లా మాస్ మీడియా అధికారిగా ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని అధికారుల నుండి ప్రజలకు చేరవేయడంలో తన వంతు సేవలందించారు. కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే విధి నిర్వహణలో ప్రజలకు ఆరోగ్య సంరక్షణ పై తగిన సూచనలను అందించడమే తన జీవిత ధ్యేయంగా పనిచేశారని డిఎంహెచ్వో అన్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలను దగ్గరగా తెలుసుకుంటూ, వారికి అవసరమైన ఆరోగ్య సమాచారాన్ని అందించడంతో పాటు వ్యాధుల నివారణ, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు నిరంతరం కృషి చేశారని తెలిపారు. తాను సంపాదించిన విద్య, అనుభవం, సామాజిక అవగాహనను ప్రజారోగ్య సేవలకు అనుసంధానం చేస్తూ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లారు. ఆరోగ్య విద్యా విస్తరణ అధికారిగా ప్రజారోగ్య విధానాలు, కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో కీలకపాత్ర పోషించారు. జిల్లా మాస్ మీడియా అధికారిగా ప్రభుత్వ వైద్యారోగ్య కార్యక్రమాలు, వ్యాధుల నియంత్రణ చర్యలు, ఆరోగ్య పరిరక్షణ, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పిస్తూ వైద్యారోగ్యశాఖ కు ప్రజల్లో ఒక బలమైన స్వరంగా నిలిచారు. అనంతరం వరంగల్ డిఎంహెచ్వో రాజారెడ్డి మాట్లాడుతూ.. ప్రజారోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు సులభంగాఅర్థమయ్యే రీతిలో చేరవేయడంలో అశోక్ రెడ్డి కి ఉన్న అనుభవం ఎంతగానో ఉపయోగపడిందని అధికారులు, వైద్య సిబ్బంది. మీడియా ప్రతినిధులు, ప్రజల మధ్య సమన్వయంతో పనిచేస్తూ శాఖా కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లారని తనకు అప్పగించిన ప్రతి బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించడం తో పాటు సహచర ఉద్యోగులకు, యువ సిబ్బందికి తన అనుభవాన్ని పంచుతూ మార్గదర్శకుడి గా నిలిచారన్నారు. వైద్యారోగ్యశాఖ లో ఆయన అందించిన విశిష్ట సేవలకు అనేక గుర్తింపులు లభించాయని ఈ గౌరవాలు ఆయన వ్యక్తిగత ప్రతిభకు మాత్రమే కాకుండా ప్రజారోగ్య రంగంలో ఆయన చేసిన నిరంతర కృషికి లభించిన గుర్తింపుగా సహచరులు అభివర్ణించారు. పదవి, హోదా కంటే ప్రజాసేవ కే అధిక ప్రాధాన్యతనిస్తూ పనిచేసిన అశోక్ రెడ్డి జీవన ప్రస్థానం ప్రభుత్వ ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసి పనిచేసిన అధికారులు, ఉద్యోగులు ఆయన సేవలను స్మరించుకుంటూ అభినందనలు తెలిపారు. అనంతరం తెలంగాణ వైద్య ఆరోగ్య గెజిటెడ్ అధికారుల సంఘం తరపున వేముల అశోక్ రెడ్డికి హృదయపూర్వక పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని వారు ఆకాంక్షించారు.

## డబుల్ బెడ్రూమ్ గృహాల మంజూరులో బీసీలకు రిజర్వేషన్ అమలు చెయ్యాలి

**మందమర్రి, మహా :** డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపులో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మందమర్రి నోడల్ అధికారి, ఎంపీడీవో రాజేశ్వర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ గత నెల 25 నాడు మందమర్రి మండలంలో నిర్వహించిన డబ్బులు బెడ్ రూమ్ గృహాల కేటాయింపులోబీసీలకు అన్యాయం జరిగిందని అన్నారు. వికలాంగులు,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ వర్గాలకు రిజర్వేషన్ల ప్రకారం డ్రా నిర్వహించారని తెలిపారు. అయితే బీసీలకు మాత్రం ఎలాంటి రిజర్వేషన్ కల్పించకుండా జనరల్ కేటగిరీలో లక్కీ డ్రా నిర్వహించడం పట్ల తాము అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామని వెల్లడించారు.బీసీలకు న్యాయంగా దక్కాల్సిన వాటాను కేటాయించకుండా జనరల్ కేటగిరీలో చేర్చి లక్కీ డ్రా నిర్వహించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని గత కొన్నేళ్లుగా ఉద్యమాలు కొనసాగుతున్నాయని గుర్తుచేశారు.

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**రీ-సర్వేను వేగవంతం చేయాలి***
**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి***
**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి***
**పూర్వ వరంగల్ జిల్లాకు చెందిన కలెక్టర్లతో హౌసింగ్, రెవెన్యూ అంశాల పై సమీక్షించిన మంత్రి***



**మహబూబాబాద్, మహా;**రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూయజమానికి చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

సోమవారం మహబూబాబాద్ ఐడీఓసీ కార్యాలయం లోరాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు సీతక్క, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఎంపి లు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రు నాయక్, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, శాసనసభ్యులు మురళీ నాయక్, కడియం శ్రీహరి, యశస్విని రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, నాయని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోతు జ్యోతి, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, గృహ నిర్మాణ శాఖల కార్యదర్శులు లోకేష్ కుమార్, రాజీవ్ గాంధీ హనుమంతు, వి.పి. గౌతమ్ తో కలిసి రెవెన్యూ, భూ రీసర్వే, రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా భూ రీసర్వే పురోగతి, నాన్‌కెడస్ట్రల్, కెడస్ట్రల్ గ్రామాల్లో సర్వే పనులు, లైసెన్స్‌డ్ సర్వేయర్ల పనితీరు, 22ఏ భూములు, సాదా బైనామాలు, అటవీ-రెవెన్యూ భూముల సరిహద్దు వివాదాలు, భూభారతి చట్టం, రిజిస్ట్రేషన్ కార్యాలయాల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, రెండో విడత ఇళ్ల మంజూరు, ఇసుక కొరత తదితర అంశాలను సమీక్షించారు.

**రీ-సర్వేను వేగవంతం చేయాలి**

రాష్ట్రవ్యాప్తంగా భూ రీసర్వే ప్రక్రియను ప్రాధాన్యతా అంశంగా తీసుకొని వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను లక్ష్యంగా ఎంపిక చేసి మొదటి విడత సర్వేను నవంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. రెండో విడత సర్వేను వచ్చే ఏడాది మార్చి నాటికి చేపట్టి, రాబోయే ఏడాదిన్నరలో రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని శాస్త్రీయంగా సర్వే చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నాన్‌కెడస్ట్రల్, కెడస్ట్రల్ గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనుల పురోగతిని మంత్రి సమీక్షించారు. సర్వే విధులకు హాజరుకాని లైసెన్స్‌డ్ సి. సర్వేయర్లకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయికి వెళ్లకుండా సర్టిఫికెట్లు జారీ చేయడం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వంటి వాటిని సహించబోమని స్పష్టం చేశారు.

**22-ఏ భూములపై సమగ్ర నివేదిక**

22ఏ కింద ఉన్న భూములపై సర్వే నంబర్ల వారీగా వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలతో సమగ్ర నివేదికను రెండు రోజుల్లో సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. పొరపాటున 22ఏ జాబితాలో చేరిన అర్హులైన రైతుల భూములను పరిశీలించి, జాబితా నుంచి తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

భూభారతి ద్వారా ప్రజలకు పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందించాలని, సాదా బైనామాలు తదితర సమస్యలను పరిష్కరించి అర్హులైన రైతులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని మంత్రి ఆదేశించారు. అటవీ-రెవెన్యూ భూముల సరిహద్దు వివాదాలను కూడా సంయుక్తంగా సర్వే నిర్వహించి శాశ్వతంగా పరిష్కరించాలని సూచించారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి**

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని మంత్రి సమీక్షించారు. ఇప్పటివరకు ప్రభుత్వం సుమారు రూ.1,200 కోట్లు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఖర్చు చేసిందని తెలిపారు. జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో పురోగతి సంతృప్తికరంగా ఉందని, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో నిర్మాణాలు ఆశించిన స్థాయిలో లేవని పేర్కొన్నారు.పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి సెప్టెంబర్ 15 నాటికి గరిష్ఠ సంఖ్యలో ఇళ్లను పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సంబంధిత కలెక్టర్లను ఆదేశించారు.రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 2,000 ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తాత్కాలిక పైకప్పులతో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకం కింద రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచిత ఇసుక అందించే వ్యవస్థలో అక్రమ వసూళ్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అదనపు రవాణా చార్జీల పేరుతో లబ్ధిదారుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.రవాణా రేట్లను శాస్త్రీయంగా నిర్ణయించి సిస్టమ్ లో నమోదు చేయాలని కలెక్టర్లకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రజలకు ఇబ్బందులు లేకుండా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.రైతుల భూముల సమస్యల పరిష్కారానికి దరఖాస్తు అవసరం సమస్య పరిష్కరించి, అప్లికేషన్స్ పెండింగ్ లేకుండా చూడాలి..సర్వే సంబంధం లేకుండా ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని అన్నారు.



# వలిగొండలో ప్రజావాణి కార్యక్రమం

- ప్రజల సమస్యలు స్వీకరించిన ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 31 (మహా న్యూస్):** వలిగొండ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి, నోడల్ అధికారి జి. జలంధర్ రెడ్డి మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ప్రజల సమస్యలు, ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. మొత్తం 21 ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 6 దరఖాస్తులు స్వీకరించారు. వీటిలో విద్యుత్ షాక్ కారణంగా గేదెలు మృతి చెందడంతో వాటికి సంబంధించిన బీమా పరిహారం మంజూరు చేయాలని కోరుతూ ఒక దరఖాస్తు సమర్పించారు.ఈ సందర్భంగా నోడల్ అధికారి జి. జలంధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికే అధికారులు ఉన్నారని, ప్రజలు తమ సమస్యలను, ఇబ్బందులను నిరభ్యంతరంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సంబంధిత శాఖల సమన్వయంతో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు చేరేలా చూడటం తమ బాధ్యత అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# ఇక చర్చలు కాదు.. సమరమే!

- పీఆర్సీ, ఓపీఎస్ అమలే లక్ష్యం.. ఉద్యోగుల డూ ఆర్ డై పోరాటం



**కరీంనగర్, మహా:** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను గత మూడేళ్లుగా ప్రభుత్వం దృష్టికి వినతులు, విన్నపాలు, విజ్ఞప్తులు, చర్చల ద్వారా తీసుకెళ్లినా ఆశించిన స్థాయిలో పరిష్కారం లభించలేదని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇక వినతులు, చర్చలు చాలన్నారు. ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం సమరానికి సిద్ధం కావాల్సిన సమయం వచ్చిందని స్పష్టం చేశారు.సెప్టెంబర్ 1న నిర్వహించనున్న పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. భద్రత, భరోసా లేని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. పెన్షన్ ఉద్యోగులకు ప్రభుత్వం చేసే దానం కాదని, వారి హక్కు అని అన్నారు. 2004 తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన వారికి వృద్ధాప్యంలో నిర్దిష్ట పెన్షన్ భద్రత లేకపోవడం బాధాకరమన్నారు. మార్కెట్ హెచ్చుతగ్గులు, పెట్టుబడులపై భవిష్యత్తు ఆధారపడటం ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు.2018 పీఆర్సీ కాలపరిమితి 2023లో ముగిసిందని, అప్పటి నుంచి కొత్త పీఆర్సీ కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. పీఆర్సీపై కమిటీలు, నివేదికలు, హామీలు ఉన్నప్పటికీ అమలు కనిపించడం లేదని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పీఆర్సీ అమలు చేయడంతో పాటు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డు వ్యవస్థను మెరుగుపరచాలని, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు.గత మూడేళ్లుగా ఉద్యోగ సంఘాలు ప్రభుత్వంతో చర్చలు జరిపాయని, ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో సంయమనంతో వ్యవహరించామని చెప్పారు. అయితే సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతోందన్నారు. తమ సహనాన్ని బలహీనతగా భావించవద్దని హెచ్చరించారు. అవసరమైతే మరోసారి సమ్మె సైరన్ మోగించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.సెప్టెంబర్ 1న ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై, భోజన విరామ సమయంలో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సెప్టెంబర్ 8న సాయంత్రం 5 గంటలకు కరీంనగర్ టీఎన్జీవో కమ్యూనిటీ హాల్‌లో ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటాలని కోరారు. పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని దారం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఆసుపత్రి హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

**గ్రీవెన్స్ లో సిపిఎం వినతి**

**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల, పడమట నర్సాపురంలోని గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సిపిఎం మండల పార్టీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. సోమవారం మండల అభివృద్ధి కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ లో ఎంపీడీవో రవికి వినతి పత్రం అందజేసి సమస్యలు వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రి, గిరిజన బాలికల వసతి గృహం ను సిపిఎం బృందం పరిశీలించి సమస్యలను గుర్తించటం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరిగినందున వైద్యశాలను 30 పడకల ఆసుపత్రిగా మార్చాలని, సిబ్బంది కొరత ఉన్నందున తక్షణమే సిబ్బందిని నియమించాలని కోరారు. అదేవిధంగా పడమట నర్సపురంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తగినన్ని బాత్రూమ్స్ లేవని, జనరేటర్ లేదని, గుట్ట దగ్గరలో ఉండడం వలన విద్యార్థులకు విష సర్పాల నుండి అపాయం పొంచి ఉన్నందున తగిన భద్రత ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు గార్లపాటి వెంకటి, ఓడల వెంకటేశ్వర్లు, బోడ అభిమిత్ర, గడిదేసి కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.






# ప్రజా సమస్యలు పరిష్కరించాలి: సిపిఎం

- ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా
- ప్రజావాణిలో వినతిపత్రం అందజేత
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామెల్

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 31 మహా:** ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామెల్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం ప్రజావాణిలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామెల్ మాట్లాడుతూ... ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. 2007 సంవత్సరంలో ఆనాటి ప్రభుత్వం నాగన్ పల్లి, దండుమైలారం, కొంగరకలాన్ గ్రామంలో ఇంటి పట్టాలు పొందిన వారికి ఇంటి స్థలం చూపించాలన్నారు. రామోజీ ఫిలిం సిటీ ఆక్రమించిన ఇళ్ల స్థలాల భూములను వెంటనే పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దండుమైలారం, తులేకలాన్ గ్రామాల్లో ఉన్న గ్రామ కంఠ భూమిని సర్వే చేసి ఇళ్లస్థలాలకు కేటాయించాలన్నారు. పోల్కంపల్లి సర్వే నెంబర్ 278 లోని రైతులకు రైతు భరోసా ఇవ్వాలి. దండమైలారం హఫీజ్ పురలో సాగు చేసుకుంటున్నా రైతులకు పట్టా పాస్ బుక్కులు ఇవ్వాలి. కప్పపహాడ్ గ్రామంలోని 98 ఎకరాల మిగులు భూమిని పేదలకు పంచాలి. పరిశ్రమల కోసం భూసేకరణలో భూములు కోల్పోయిన ఎలిమినేడు రైతులకు పూర్తిస్థాయి నష్టపరిహారం ఇవ్వాలి. నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ భూములకు పట్టా పాస్ బుక్ లు ఇచ్చి రైతు భరోసా, రైతు బీమా ఇవ్వాలన్నారు. రేషన్ షాపులో బియ్యంతో పాటు కందిపప్పు, శనగపప్పు, పెసరపప్పు, మంచి నూనె, కోడిగుడ్లు, మిల్లెట్స్, చక్కెర, చింతపండు, పసుపు, కారంపొడి, ఉప్పు, కొబ్బరినూనె వంటి 14 రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆసరా పెన్షన్లు వృద్ధులకు కూడా ఇవ్వాలన్నారు. ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తా నుంచి అక్టోపాస్ వరకు రోడ్డు సమస్య పరిష్కరించాలి. స్కూల్స్, హాస్టల్స్ లో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో దున్నపోతుపై వర్షం కురిసిన చందంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రజా సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బుగ్గరాములు, జిల్లా కమిటీ సభ్యులు జంగయ్య, జగన్, మండల కమిటీ సభ్యులు తులసిగారి నరసింహ, వెంకటేష్, ప్రభుదాస్, ఆమనగంటి నరసింహ, ఆనంద్, గూడేటి జంగయ్య, లింగస్వామి, రమేష్, శాఖా కార్యదర్శులు పంది యాదయ్య, కరుణాకర్ రెడ్డి, గూడేటి వెంకటేష్, విగ్నేష్, యాదగిరి, నాయకులు అశోక్, నిట్టు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారమే ప్రభుత్వ లక్ష్యం..

**- పినపాక ఎమ్మెల్యే పాయం ..**

**మణుగూరు, మహా :** పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని విఠల్‌రావు నగర్‌లో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నూతనంగా నిర్మించిన గృహాలను సందర్శించి లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు సొంత గూడు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. సొంతింటి కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు భరోసాగా నిలుస్తున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు రావుల పరిమిళ, బిజిగి కోటేశ్వరి, గంగిశెట్టి ఎల్లమ్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. నూతన గృహాల్లో ఆయా కుటుంబాలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు కురం రవి, నాయకులు కూచిపూడి బాబు, రహీం పాష, పాల్వంచ రాములు, శివ సైదులు, బత్తుల శ్రీనివాస్, మైనారిటీ విభాగం నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# ఆదివాసి బిడ్డ శిరీష హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి..

**బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకుల డిమాండ్**

**మణుగూరు, మహా :** హైదరాబాద్ తుక్కుగూడ-మహేశ్వరం ప్రాంతంలోని ప్రైమ్ కేర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఆదివాసి బిడ్డ ఊకే షిరీష దారుణ హత్యకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని మణుగూరు మండల బీఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. శిరీష హత్య ఘటన అత్యంత దారుణమని, ఉపాధి కోసం ఇంటికి దూరంగా వెళ్లి పనిచేస్తున్న ఆదివాసి యువతికి ఇలాంటి పరిస్థితి ఎదురుకావడం తీవ్ర ఆవేదన కలిగిస్తోందని ఆదివాసి నేతలు పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా, సమగ్రంగా దర్యాప్తు జరిపి బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివాసి మహిళలు, యువతుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, శిరీష కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆదివాసి సమాజం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దమ్మక్కపేట గ్రామపంచాయతీ సర్పంచ్ మడి స్వరూప, ముత్యాలమ్మనగర్ సర్పంచ్ కొమరం జంపేశ్వర్, ముత్యాలమ్మనగర్ ఉప సర్పంచ్ బోడ శ్రీను నాయక్, కూనవరం మాజీ సర్పంచ్ ఏనిక ప్రసాద్, తొగ్గూడెం మాజీ సర్పంచ్ బొగ్గం రజిత, బుగ్గ మాజీ సర్పంచ్ తాటి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ కాటిబోయిన సుజాత, వార్డు సభ్యులు వజ్జా భవాని రాముడు తదితరులు షీరీష కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులకు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం

**మండల అధ్యక్షుడిగా సాయికుమార్ మాదిగ**

**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మండల కేంద్రంలో, మండల ఇంచార్జ్ చెంగల గురునాథం మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల నూతన కమిటీ ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా గురునాథం మాట్లాడుతూ మండలంలో ఏడు మాదిగ గ్రామాలు ఉన్నాయని, ఏడు గ్రామాల, గ్రామ అధ్యక్షులు, గ్రామ కమిటీల ఏకగ్రీవ తీర్మానం మేరకు దిబ్బెందల సాయి కుమార్ మాదిగ ని మండల ఎమ్మార్పీఎస్ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. మాదిగ హక్కుల సాధన కోసం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ముందుకు సాగి, మండలంలో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని నూతన అధ్యక్షుడు సాయికుమార్ మాదిగ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా గార్లపాటి నవీన్, ప్రధాన కార్యదర్శిగా దొంగల సృజన్, సహాయ కార్యదర్శిగా, పోతురాజు అనిల్ కుమార్, అధికార ప్రతినిధిగా గార్లపాటి నిఖిల్, కోశాధికారిగా ఉబ్బపల్లి నరసింహారావు, కార్యవర్గ సభ్యులు జంగం నాగరాజు లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాకటి కృష్ణ, గార్లపాటి కృష్ణ, గార్లపాటి శివ కృష్ణ, బద్రి, విసనపల్లి కళ్యాణ్, నేనాలా నరేష్ బాబు, మండలంలోని ఏడు గ్రామాల ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు, గ్రామ కమిటీ సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# అస్తిత్వం కోల్పోతున్న పల్లె చెరువు

- 40 ఎకరాల చెరువు.. 15 ఎకరాలకే పరిమితం
- గడ్డి, గుర్రపుడెక్క, పారిశ్రామిక వ్యర్థాలతో కంపు
- ఆక్రమణలపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు
- ఈసారి గణేష్ నిమజ్జనం పల్లె చెరువులో జరిగేనా?
- దీనికి కారకులు ఎవరు?



**రాజేంద్రనగర్, మహా:** ఒకప్పుడు పంట పొలాలకు నీరందించిన మైలార్‌దేవ్‌పల్లి పల్లె చెరువు నేడు గుర్రపుడెక్కతో నిండిపోయింది. సాగునీటితో కళకళలాడిన చెరువు ప్రస్తుతం మురికి నీటితో కంపుకొడుతోంది. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఏ చెరువు చూసినా కబ్జాలకు, పారిశ్రామిక వ్యర్థాలకు కేంద్రాలుగా మారుతున్నాయి.శిఖం భూమి, ఎఫ్‌టీఎల్ అనే తేడా లేకుండా ఆక్రమణలతో చెరువులు కనుమరుగవుతున్నాయి. ఎకరాలకు ఎకరాలు విస్తీర్ణంలో ఉన్న చెరువులు రాజేంద్రనగర్‌లో గతం ఎంతో ఘనం అన్న పరిస్థితికి చేరుకున్నాయి. పూడికతీసే నాథుడే లేక చెరువులు గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. ఆక్రమణలకు గురికావడంతో తూములు ఎక్కడ ఉన్నాయో వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మైలార్‌దేవ్‌పల్లిలోని పల్లె చెరువు కూడా ఈ కోవలోకే వస్తుంది.రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లిలో ఉన్న పల్లె చెరువు విస్తీర్ణం దాదాపు 40 ఎకరాలు. కానీ ఇందులో 25 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైంది. బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు వెలిశాయి. చెరువును ఆక్రమించుకునేందుకు పారిశ్రామిక వ్యర్థాలు, మట్టిని పోస్తున్నారు. మట్టిని లెవల్ చేసి నిర్మాణాలు చేస్తున్నారు. దీనివల్ల చెరువులోకి నీరు వచ్చినా ఎక్కడా నిలిచే పరిస్థితి లేదు. కబ్జాలకు గురై ఇళ్లు నిర్మిస్తున్నా సంబంధిత శాఖల అధికారులు అటువైపు చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.హైడ్రా అధికారులు కూడా అటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు అంటున్నారు. చెరువులు, నాలాలు, వరద కాలువల పరిరక్షణ కోసం హైడ్రా ఏర్పడింది. నాలాలు ఆక్రమణకు గురైన చోట వరద నీరు బయటికి వచ్చి ఇళ్లలోకి, రహదారులపైకి వస్తోంది.పల్లె చెరువులో కొంతభాగం రాజేంద్రనగర్ రెవెన్యూ పరిధిలోకి, మరికొంత భాగం బండ్లగూడ రెవెన్యూ పరిధిలోకి వస్తోంది. ప్రజాప్రతినిధుల బెదిరింపులకు తలొగ్గి అధికారులు అటువైపు చూడటానికే భయపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాయకుల అనుచరులు, కార్యకర్తలే కబ్జాలకు పాల్పడుతున్నారని వారు పేర్కొంటున్నారు.

**నిమజ్జనానికి సందేహాలు...**

వినాయక విగ్రహాల నిమజ్జనానికి మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్ డివిజన్లలో ఉన్న ఏకైక చెరువు పల్లె చెరువు. ప్రస్తుతం దీని ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. రెండు డివిజన్లలో ప్రతి ఏటా సుమారు 1,000కు పైగా గణేష్ విగ్రహాల నిమజ్జనానికి సిద్ధమయ్యే పల్లె చెరువు నేడు కళ తప్పి అస్తిత్వం కోల్పోయే స్థితిలో ఉంది. పిచ్చిమొక్కలు, పారిశ్రామిక వ్యర్థాలు, గుర్రపుడెక్కతో నిండిపోయింది.రెండు డివిజన్లకు చెందిన గణేష్ అసోసియేషన్ సభ్యులు గణేష్ నిమజ్జనం కోసం పల్లె చెరువుపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# నాలుగు దశాబ్దాల విద్యా సేవలకు ఘన వీడ్కోలు

- ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

**దమ్మపేట,మహా:** మండల పరిదిలో ని అంకంపాలెం గిరిజన బాలికల ఆశ్రమ కళాశాలలో సోమవారం వీడ్కోలు సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. విద్యారంగంలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందుతున్న అంకంపాలెం ఉపాధ్యాయులు కత్తుల ఆలయ్య, కుక్కల పులమ్మలకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఒక ఉపాధ్యాయుడు తరగతి గదిలో అందించే విద్యతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందిస్తారని పేర్కొన్నారు. దశాబ్దాల పాటు విద్యార్థులకు విద్యాబోధన చేసి, వారి ఉన్నతికి కృషి చేసిన కత్తుల ఆలయ్య, కుక్కల పులమ్మ సేవలు అభినందనీయమన్నారు. కత్తుల ఆలయ్య బీఎస్సీ, బీఎడ్, ఎంఏ, జేఎల్ ఇన్ ఇంగ్లీష్ విద్యార్హతలతో సుమారు 40 సంవత్సరాల పాటు విద్యారంగంలో సేవలందించారు. జెడ్పీ పరిధిలో సేవల అనంతరం గురుకుల విద్యా సంస్థలో సుదీర్ఘకాలం పనిచేసి 2026 ఏప్రిల్ 30న పదవీ విరమణ పొందారు. అదేవిధంగా కుక్కల పులమ్మ ఎంఏ, టీపీటీబీఎడ్, జేఎల్ ఇన్ తెలుగు విద్యార్హతలతో 1990 జూన్ 20 నుంచి 2026 ఆగస్టు 31 వరకు సుమారు 36 సంవత్సరాల పాటు గురుకుల విద్యా సంస్థలో సేవలందించారు. అంకంపాలెంలో ప్రిన్సిపాల్ గా బాధ్యతలు నిర్వహిస్తూ విద్యార్థుల విద్యా ప్రగతికి విశేషంగా కృషి చేశారని తెలిపారు. ఉపాధ్యాయుల పదవీ విరమణ ఉద్యోగ జీవితానికి మాత్రమేనని, విద్యార్థుల హృదయాల్లో వారు నాటిన జ్ఞానం, విలువలు, స్పూర్తికి మాత్రం ఎప్పటికీ పదవీ విరమణ ఉండదని అన్నారు. వారి సేవలను స్పూర్తిగా తీసుకుని ప్రస్తుత ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధికి మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పదవీ విరమణ పొందుతున్న వారిని శాలువాలతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. వారి భవిష్యత్ జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంకంపాలెం సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొని పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.

# హత్యా కేసులో 23 మంది అరెస్టు

- మణుగూరులో గ్యాంగ్‌వార్‌కు పోలీసుల చెక్..
- పాత కక్షలతో ప్రత్యర్థులపై దాడికి పథకం
- ప్రధాన నిందితులపై గతంలోనూ హత్య, హత్యాయత్నం, గంజాయి, పోక్సో కేసులు
- 9 కర్రలు, 20 సెల్‌ఫోన్లు, కారు, ద్విచక్ర వాహనం స్వాధీనం




**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో కొంతకాలంగా రెండు వర్గాల మధ్య కొనసాగుతున్న పాత కక్షలు మరోసారి భగ్గుమన్నాయి. ప్రత్యర్థి వర్గానికి చెందిన వారిపై దాడి చేసి అంతమొందించాలనే ఉద్దేశంతో గ్యాంగ్‌గా ఏర్పడి దాడికి పాల్పడిన ఘటనలో మణుగూరు పోలీసులు 23 మందిని అరెస్టు చేశారు. ఈ కేసులో మొత్తం 27 మందిని నిందితులుగా గుర్తించగా, 23 మందిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. మణుగూరులోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన రెండు వర్గాల మధ్య కొంతకాలంగా ఆధిపత్య పోరు, పాత గొడవలు కొనసాగుతున్నాయి. గతంలో జరిగిన ఘర్షణల నేపథ్యంలో ఒకరిపై ఒకరు కక్ష పెంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ప్రత్యర్థి వర్గంపై దాడికి పథకం రూపొందించుకుని, గుంపుగా వెళ్లి హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైందన్నారు. ఘటనపై మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 309/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్లు 189(2), 103(2), 109(1), 351(3), 61(2) రెడ్‌విత్ 190 ప్రకారం కేసు నమోదు చేశారు.

**ప్రధాన నిందితులపై పాత కేసుల చిట్టా**

ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న జెట్టి రామకాంత్ అలియాస్ రమ్మి, జెట్టి పవన్‌కుమార్‌పై గతంలోనే రెండు హత్య కేసులు, రెండు హత్యాయత్నం కేసులతో పాటు గంజాయి, పోక్సో కేసులు నమోదై ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. మరో నిందితుడు గోపిపై గతంలో హత్య, గంజాయి కేసులు, పవన్ అలియాస్ సిహెచ్ పై రెండు గొడవ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పాత కేసులు ఉన్నప్పటికీ తీరు మార్చుకోకుండా మళ్లీ ఘర్షణలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతామని హెచ్చరించారు.

**23 మంది అరెస్టు.. నలుగురి కోసం గాలింపు**

ఈ కేసులో జెట్టి రామకాంత్ @ రమ్మి, జెట్టి పవన్‌కుమార్, గోపి, పవన్ అలియాస్ సిహెచ్, కందుల దినేష్, అక్కిరెడ్డి అభినయ్‌రెడ్డి అలియాస్ అబ్బిరెడ్డి, సోయం నరసింహారావు అలియాస్ ఈశ్వర్, ఈశ్వర్ కోటేశ్వర్ అలియాస్ కోటేశ్వర్ తదితరులు కలిపి మొత్తం 23 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసులో మొత్తం 27 మందిని నిందితులుగా గుర్తించగా, పరారీలో ఉన్న మిగిలిన నలుగురి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు చెప్పారు.

**అరెస్టయిన వారి నుంచి 9 కర్రలు, 20 సెల్‌ఫోన్లు, ఒక కారు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం**

అరెస్టయిన నిందితుల నుంచి 9 కర్రలు, 20 సెల్‌ఫోన్లు, ఒక కారు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు. ఘటన వెనుక ఎవరెవరి పాత్ర ఉంది, దాడికి ఎవరు పథకం రూపొందించారు, మరెవరైనా సహకరించారా అనే కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

**గ్యాంగ్‌ల పేరుతో రెచ్చిపోతే కఠిన చర్యలు..**

మణుగూరు ప్రాంతంలో గ్యాంగ్‌లుగా ఏర్పడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా, పాత కక్షలతో దాడులు, హత్యాయత్నాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన మణుగూరు సీఐ పాటి నాగబాబు, ఎస్సైలు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



# పోలీస్ శాఖకు మీ సేవలు మరువలేనివి

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- ఉద్యోగం విరమణ అధికారులకు సన్మానం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** పోలీస్ శాఖకు మీ సేవలు మరువలేనివని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు విశిష్ట సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.37 సంవత్సరాల పాటు పోలీసు శాఖలో సేవలందించిన ఏఎస్ఐ పసునూరి నాగరాజు, ఏఎస్ఐ షేక్ మహబూబ్ అలీ, ఏఎస్ఐ చాచు వెంకటేశ్వర్లు పదవీ విరమణ పొందారు. వీరిని జిల్లా ఎస్పీ శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన అధికారులు తమ పోలీసు సేవా అనుభవాలను పంచుకున్నారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. వ్యాయామం యోగా ధ్యానం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను కొనసాగించాలని సూచించారు.పదవీ విరమణ పొందిన అధికారులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రభుత్వం నుంచి రావాల్సిన పదవీ విరమణ ప్రయోజనాలు సకాలంలో అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్యనాయక్, ఎస్బి ఇన్స్పెక్టర్ ఇ.శ్రీనివాస్, ఆర్ఐ కృష్ణారావు, పోలీసు అధికారుల సంఘం సభ్యులు, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుదాసు మాస్టారు పదవి విరమణ

- పుట్టిన ఊరి పాఠశాలలో సేవలందించిన ప్రధానోపాధ్యాయుడికి ఘన వీడ్కోలు
- పదవీ విరమణ సమయానికి అనారోగ్యానికి గురికావడం బాధాకరం: ఎం.ఈ.ఓ నక్క రాజేశ్వరరావు

**సత్తుపల్లి,ఆగస్టు 31**:మహా : మండల పరిధిలోని కిష్టారం గ్రామంలో ఎం.పీ.పీ.ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ తన సొంత గ్రామంలో పేద విద్యార్థుల అభ్యున్నతికి తన వంతు సహాయ సహకారాలు అందించిన కొండా ప్రభుదాసు సోమవారం పదవీ విరమణ చేశారు. చదువుకునే విషయంలో పాఠశాల విద్యార్థులు అసౌకర్యానికి గురైన ప్రతిసారీ సమస్యను తన సొంత ఖర్చులతోనైనా పరిష్కరించే గుణం ఆయన సొంతం అని సహచర ఉపాధ్యాయులు కొనియాడారు. తన వద్ద చదువుకున్న ప్రతి విద్యార్థి జీవితంలో ప్రయోజకుడిగా ఎదగాలనే దృఢ సంకల్పంతో ప్రభుదాసు విధుల పట్ల అంకితభావంతో పనిచేశారని పేర్కొన్నారు. పేద విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేసుకున్నారు.

**అనారోగ్యానికి గురికావడం బాధాకరం..**

నాణ్యమైన విద్యను పిల్లలకు అందించడం, పాఠశాలలో మౌలిక సదుపాయాలను సొంత ఖర్చులతో మెరుగుపరచడంలో తమదైన ముద్రను ప్రభుదాస్ ఏర్పరచుకున్నారని ఎం.ఈ.ఓ కొనియాడారు. తమ సేవను గుర్తించి జిల్లా కలెక్టర్ ప్రభుదాస్ ను ఉత్తమ ఉపాధ్యాయునిగా సన్మానించిన తీరును ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనివార్య కారణంతో ప్రధానోపాధ్యాయుడు కొండా ప్రభుదాస్ పదవీ విరమణ సమయానికి అనారోగ్యానికి గురికావడం బాధాకరమని ఎం.ఈ.ఓ నక్క రాజేశ్వరరావు అన్నారు. విద్యార్థుల పట్ల ప్రేమ, వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసిన ఆయన సేవలు అభినందనీయమని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిలో ప్రభుదాసు చూపిన నిబద్ధత ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తుందని ప్రశంసించారు.

**దంపతులకు ఘన సన్మానం**

పదవీ విరమణ సందర్భంగా విద్యాధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, కుమార్తె హారిక (స్వీటీ), కుటుంబ సభ్యుల సమక్షంలో కొండా ప్రభుదాసు, నాగరత్నం దంపతులను ఘనంగా సన్మానించారు. శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ప్రభుదాస్ మాస్టారు తమ పాఠశాలకు, విద్యార్థులకు అందించిన సేవలను తల్లిదండ్రులు గుర్తు చేసుకున్నారు. ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ సహజమేనని మాస్టారు భావి జీవితం సుఖసంతోషాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో సాగాలని ఆకాంక్షిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి అప్పారావు, కాంగ్రెస్ నాయకుళ్ళ అప్పారావు, విద్య అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

- - ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి
- - ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ సూచన

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** గణేష్ నవరాత్రుల ఉత్సవాలను ప్రజలకు ఇబ్బంది కలుగకుండా మతసామరస్యాన్ని పాటించి శాంతియుతంగా జయప్రదంగా జరిగే విధంగా చూడాలని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు. భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశం స్థానిక చుంచుపల్లిలోని సోమవారం సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ లౌకికవాదిగా తాను అన్ని మతాలను మత సంస్కృతులను గౌరవిస్తానని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాల నేపథ్యంలో చందాల దందాలను బలవంతపు వసూళ్లను చేయకుండా ప్రేమతో గౌరవంతో ఇచ్చిన విరాళాన్ని స్వీకరించాలన్నారు. ఒక వీధిలో ఒకే విగ్రహాన్ని నెలకొల్పి ఆ వీధిలో వాహనదారులకు మార్గాన్ని తప్పకుండా చూపించాలన్నారు. అంతేగాని ఒక వీధిలో మూడు నాలుగు విగ్రహాలు పెట్టి ఆ మార్గాన్ని మూసి వెయ్యరాదన్నారు. రహదారి కూడళ్లలో(జంక్షన్స్) ఎట్టి పరిస్థితిలోనూ విగ్రహాలను నెలకొల్ప రాదని సూచించారు. దయచేసి డీజే సౌండ్ సిస్టంను మండపాల వద్ద నిషేదించాలన్నారు. ఎందుకంటే బలహీనమైన ఆరోగ్యం గలవారు ఈ పెద్ద సౌండ్ పొల్యూషన్ తో గుండె ఆగి చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మామూలు సౌండ్ తో ఏర్పాటు చేసుకోవాలన్నారు. గణేశుని మండపాల వద్ద పవిత్రమైన ఆత్మీయమైన భక్తి ప్రపత్తులతో కూడిన వాతావరణాన్ని కలిగించాలన్నారు. అంతేగానీ ఉద్రిక్త గొడవలతో కూడిన వాతావరణం గాని నివారించాలని సూచించారు. నిమజ్జనం రోజున ట్రాఫిక్కును నియంత్రణ చేసి ఏ ఏరియా విగ్రహాలను ఏ మార్గాలలో డైవర్ట్ చేయాలో ఒక ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలన్నారు. పై సూచనలను మార్గదర్శక సూత్రాలను, అమలుపరిచేటట్లుగా గణేష్ నవరాత్రి ఉత్సవాల కమిటీ సభ్యులు పోలీస్ అధికారులు అప్రమత్తమై తగు చర్యలు తీసుకోవాలని ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం అత్యవసర సమావేశంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లి శంకర్, టిఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, జిల్లా అధ్యక్షులు మచ్చ పృథ్వీరాజ్, భారతరత్న అంబెద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూపతి అశోక్, జిల్లా నాయకులు రాజేశ్వరరావు, శ్రీనివాస్, విజయరాజు, సంతోష్ కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు కురవాలని శివయ్యకు జలాభిషేకం

**రాజేంద్రనగర్, మహా:** సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని కోరుతూ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని శ్రీ వెండికొండ సిద్ధేశ్వర స్వామి (సిద్ధుల్‌గుట్ట) ఆలయంలో సోమవారం శివుడికి జలాభిషేకం నిర్వహించారు. జాతర కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.వర్షాలు సకాలంలో కురవాలని, ప్రజలు, రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు కమిటీ అధ్యక్షుడు తెలిపారు. శివలింగానికి జలాభిషేకం చేయడం వల్ల వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రకృతి శాంతిస్తుందని భక్తుల నమ్మకమన్నారు.కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు మాడపాటి నరేందర్‌తో పాటు కమిటీ సభ్యులు శివారెడ్డి, అప్ప, శంకర్ రెడ్డి, పాండు గుప్తా, మేకల వెంకటేష్, శ్రీకాంత్ రెడ్డి, జంగయ్య, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



# రిపోర్టర్ వలిని పరామర్శించిన టీ జె ఏ జిల్లా అధ్యక్షుడు షానూర్

**వలిగొండ ఆగస్టు 31 మహా న్యూస్ :** మండల కేంద్రానికి చెందిన సూర్య దినపత్రిక జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నాగేల్లి వలి తండ్రి నాగేల్లి రాములు ఇటీవలఅనారోగ్యంతో స్వర్గస్తులైనారు. విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించిన తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, మీడియా అక్రిడెషన్ కమిటీ సభ్యులు మొహమ్మద్ షానూర్ బాబా.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టుల కుటుంబాలకు ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చినప్పుడు ప్రభుత్వము కార్పొరేట్ స్థాయి వైద్యం అందించి జర్నలిస్టు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. వారితోపాటు టీ జె ఏ ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న,జిల్లా కార్యదర్శి యానాల సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# ఏజెన్సీలో అక్రమ కట్టడాలు కూల్చాలి

**ప్రజావాణిలో ఆదివాసీ నాయకుల ఫిర్యాదు**

దమ్మపేట, మహా: ఏజెన్సీ ప్రాంతంలో పీసా గ్రామ సభల అనుమతులు లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల కట్టడాలను వెంటనే కూల్చివేయాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. పీసా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టి వాటిలో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని అధిక ధరలకు విక్రయిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగిస్తున్నారని తెలిపారు. ఏజెన్సీలో ఆదివాసుల భూములు, హక్కులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.





**శిరీష మృతికి నివాళి**

గిరిజన యువతి శిరీష అత్యాచారానికి గురై మృతి చెందడంపై ఆదివాసీ సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దమ్మపేటలో తంబళ్ల రవి ఆధ్వర్యంలో, అంకంపాలెంలో కాక రమేష్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పలువురు జేఏసీ, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

- ప్రజావాణిలో కలెక్టర్ అధికారులకు సూచన
- గ్రీవెన్స్ లో సమస్యలపై వినతుల వెల్లువ



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**ప్రజావాణి వినతులకు ఆయా శాఖల అధికారులు సత్వర పరిష్కారం చూపాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డీఆర్వో పద్మావతి, హౌసింగ్ పీడీ సవయ్ రామ్ తో కలసి స్వీకరించారు. భూ సంబంధిత వివాదాలు రెవెన్యూ అంశాలు సంక్షేమ పథకాల అమలు ఉపాధి పెన్షన్లు గృహాలు మౌలిక వసతులు సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ప్రభుత్వం కల్పించిన ముఖ్యమైన వేదిక అని అన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం జాప్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖలకు వెంటనే పంపించాలని సూచించారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో ప్రజల సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ పరిష్కార స్థితిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా స్పందించి ప్రభుత్వ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందించాలని తెలిపారు.జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ప్రతీ మండల ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలోనే ప్రజలు తమ సమస్యలు వినతులను మండల ఎంపీడీఓ ఆధ్వర్యంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందే అవకాశం ఉందన్నారు. ప్రజలందరు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు తమ వినతులతో పాటు సమస్యకు సంబంధించిన అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన జవాబుదారీతనంతో కూడిన పాలన అందించేందుకు ప్రతి అధికారి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# డబుల్ బెడ్‌రూమ్ గృహాల కేటాయింపుపై విచారణ చేపట్టాలి

- కేవలం అర్హులైన పేదలకు మాత్రమే గృహాలు ఇవ్వాలి
- ప్రజావాణి కి ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ డిమాండ్

**మందమర్రి, మహా :** గత నెల 25న మందమర్రి మండల కేంద్రంలో చేపట్టిన లక్కీ డ్రా ద్వారా డబుల్ బెడ్‌రూమ్ గృహాల కేటాయింపు పై సమగ్ర విచారణ జరిపించాలని కోర్టు సోమవారం మందమర్రి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి నోడల్ అధికారికి ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సంస్థ లిఖితపూర్వక ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభుదేవ్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నందిపాట రాజ్ కుమార్ లు మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి విడుదల చేసిన జాబితాలో అనర్హులు ఉన్నారనే ఆరోపణలు చాలా వస్తున్నాయని తెలిపారు. మొదట విడుదల చేసిన జాబితాలో 447 ఇళ్లకు సంబంధించిన వివరాలు ఉండగా, డబుల్ బెడ్ రూమ్ లక్కీ డ్రా లో అర్హుల సంఖ్య 491 ను పెరగడంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ కేటగిరీలకు చెందిన లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారో ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని కోరారు. అలాగే, ఇప్పటికే సొంత ఇళ్లు ఉన్నవారు, సింగరేణి సంస్థలో పనిచేసి రిటైర్ అయిన కొంతమంది కార్మికులు ప్రస్తుతం సింగరేణి క్వార్టర్లలో నివసిస్తున్నప్పటికీ లబ్ధిదారుల జాబితాలో ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి అంశాలపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించకుండా లక్కీ డ్రా నిర్వహించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వారు మండిపడ్డారు. లక్కీ డ్రా ద్వారా 307 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు పేర్కొంటూ, అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ కేటగిరీల వారీగా ఎంత మందికి ఇళ్లు కేటాయించారో శ్వేతపత్రం రూపంలో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుల ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించారా లేదా అనే విషయంపై సమగ్ర విచారణ జరపాలని, అర్హుల జాబితాను పునఃపరిశీలించాలని కోరారు. ఒకవేళ విచారణలో అనర్హులు ఉన్నట్లు తేలితే, వారి కేటాయింపులను రద్దు చేసి నిజమైన అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేదలకు అన్యాయం జరగకుండా, మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ నాయకులు కోరారు. ఈ విషయంపై అధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపి న్యాయమైన, పారదర్శకమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, పృధ్వి, రఫీ, జావిద్, స్థానికులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట

- రూ.50 లక్షలతో కంపోస్టింగ్ షెడ్ కు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్
- పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



**పెద్దపల్లి, మహా ;** పెద్దపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్ విజయ రమణారావు అన్నారు. సోమవారం పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు.పెద్దపల్లి మండలం రాఘవాపూర్ వద్ద రూ.50 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న కంపోస్టింగ్ షెడ్‌కు ప్రభుత్వ విప్ విజయరమణారావు శంకుస్థాపన చేశారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు కంపోస్టింగ్ షెడ్ ఉపయోగపడుతుందని తెలిపారు.అనంతరం పెద్దపల్లి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను పంపిణీ చేసి, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.తదుపరి పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో పాల్గొని పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాల పై చర్చించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు.అలాగే సుల్తానాబాద్ పట్టణంలోని 15వ వార్డు పూసాలలో, పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి, 27వ వార్డు సుభాష్‌నగర్, 25వ, 33వ వార్డుల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజల సంక్షేమం, పట్టణాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ విజయ రమణారావు తెలిపారు..



# చీర్యాల డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలి

**ఏఈ పనేంద్ర ని కలిసి వినతిపత్రం అందజేసిన కాలనీ వాసులు**

**కుషాయిగూడ,మహా :** చీర్యాల డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ కాలనీ వాసులు విద్యుత్ శాఖ ఏఈని కలిసి వినతిపత్రం సమర్పించారు. కాలనీలోని ఇళ్లకు ఇప్పటివరకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయకపోవడంతో విద్యుత్ వినియోగంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి ఇంటికి ప్రత్యేకంగా విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలు ఇబ్బందులు పడకుండా అధికారులు స్పందించి విద్యుత్ మీటర్ల ఏర్పాటు, సరఫరా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీ వాసుల వినతిని పరిశీలించిన ఏఈ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వనం దాస్ రమేష్ గౌడ్, మధు, గణేష్, లక్ష్మయ్య, గోపాల్, రాహుల్ తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

# హత్య కేసును ఛేదించిన పోలీసులకు డీఎస్పీ అభినందన

- 23 మంది నిందితులను పట్టుకోవడంలో చాకచక్యం
- గంజాయి, మత్తు పదార్థాల జోలికెళ్తే కఠిన చర్యలు: డీఎస్పీ రవీందర్‌రెడ్డి.



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో సంచలనం సృష్టించిన శివకుమార్ హత్య కేసును ఛేదించి 23 మంది నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని డీఎస్పీ రవీందర్‌రెడ్డి ప్రశంసించారు. కేసు దర్యాప్తులో సీఐ నాగబాబు, ఎస్సైలు నగేష్‌కుమార్, రవూఫ్ కీలక పాత్ర పోషించారని అభినందించారు. హత్య కేసులో నిందితులను గుర్తించి, తక్కువ సమయంలో వారిని అదుపులోకి తీసుకోవడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారని డీఎస్పీ పేర్కొన్నారు. క్లిష్టమైన కేసులను ఛేదించడంలో పోలీసుల సమష్టి కృషి అభినందనీయం. శాంతిభద్రతల పరిరక్షణలో ఇదే స్ఫూర్తితో పనిచేయాలి. ప్రజల్లో భద్రతపై మరింత నమ్మకం పెంచేలా పోలీసింగ్ ఉండాలని సిబ్బందిని అభినందిస్తూ సూచించారు.

**యువత మత్తుకు దూరంగా ఉండాలి**

యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. మత్తు పదార్థాల ప్రభావంతో రోడ్లపై అల్లర్లు, గొడవలు సృష్టించడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం వంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శివకుమార్ హత్య కేసులో నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ నాగబాబు, ఎస్సైలు నగేష్‌కుమార్, రవూఫ్‌తో పాటు పోలీసు సిబ్బంది పనితీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# వృద్ధులకు ఆసరాగా ప్రణామ్

**ఆదిలాబాద్ మహా :** వృద్ధాప్యంలో ఒంటరితనానికి దూరంగా ఆహ్లాదకర వాతావరణంలో సమయం గడిపేందుకు ప్రణామ్ డే కేర్ సెంటర్లు చక్కటి వేదికగా నిలుస్తున్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కేంద్రంలోని వసతులను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధులకు సాంత్వన, మానసిక ఉల్లాసం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. వృద్ధులంతా ప్రణామ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.వృద్ధులకు అందుతున్న సేవలు, కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ స్వయంగా వృద్ధులకు అల్పాహారం వడ్డించారు. వారితో కలసి అల్పాహారం చేశారు. మారుతున్న జీవన విధానంతో వయోవృద్ధులు ఒంటరితనానికి గురికాకుండా పగటి సమయంలో ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందుకు ప్రణామ్ డే కేర్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. వృద్ధులకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలతోపాటు మానసిక ప్రశాంతత, సామాజిక భద్రత కల్పించడమే ఈ కేంద్రాల ప్రధాన ఉద్దేశమని వివరించారు. కేంద్రంలో అందించే రోజువారీ ఆరోగ్య పర్యవేక్షణ, వినోద కార్యక్రమాలు, పరస్పర ఆత్మీయత వృద్ధుల్లో మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.తమతో కలసి కూర్చొని ఆత్మీయంగా మాట్లాడిన కలెక్టర్‌కు సీనియర్ సిటిజన్లు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి మిల్కా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ సిటిజన్లు తదితరులు పాల్గొన్నారు.

# మాలలపై జరిగిన పోలీసు దాడి అప్రజా స్వామికం

- ప్రజాస్వామికవాదులు ఖండించాలి
- జీవో నెంబర్ 99 ని రద్దు చేసి మాలలను గ్రూప్ 3 లోని 26 కులాలకు న్యాయం చేయాలి



**హైదరాబాద్ ఆగస్టు 31 మహా :** తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సోమవారం రోజు మాల హక్కుల కోసం ప్రజాస్వామ్య బద్ధంగా సెక్రటేరియట్కి వచ్చిన మాలలపై పోలీసులు అమానుషంగా దాడి చేసి గాయపరచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాలల రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఖండించారు. రోస్టర్ ద్వారా మాలలకు జరుగుతున్నతీరు అన్యాయం జరుగుతుందని జీవో 99 రద్దుచేసి మాల గ్రూప్ 3 లోని 26 కులాలకు న్యాయం చేయాలని 20 లోపు రెండు రోస్టర్ పాయింట్లు మాలలకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాలలపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ మాలలను విద్యా ఉద్యోగ అవకాశాలకు దూరం చేస్తున్నాడని ఈ సందర్భంగా ఆయన అన్నారు. మాలలపై జరిగిన దాడి హేయమైన చర్య అని ప్రభుత్వం ముఖ్యమంత్రి దీనికి బాధ్యత వహించాలని రోస్టర్ విధానంలో 20లోపు రెండు రోస్టర్ పాయింట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రజాస్వామ్యబద్ధంగా సెక్రెటరీ వచ్చిన మాలలపై పోలీసులను దాడి చేసి గాయపరిచారని దాడులను ఖండిస్తూ అన్ని జిల్లాలలో నల్ల బ్యాడ్జీలతో అంబేద్కర్ విగ్రహాల ముందు నిరసన తెలుపుతామని పిలుపునిచ్చారు. ఎంత నిర్బంధ విధించిన సెక్రటేరియటును ముట్టడించామన్నారు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో రోస్టర్ ను సవరించకపోతే రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుతామని హెచ్చరించారుప్రభుత్వంతో మాలలు యుద్ధం చేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మేడి అంజయ్య నల్లాల కనకరాజు రేఖం శ్రీరాములు నాయకోటి రవికాంత్ అసాధ్య పురుషోత్తం గౌడల్లి చంద్రశేఖర్ సుందరరావు చింత సత్తి రమణమూర్తి బట్టి సత్యనారాయణ అల్లి బిల్లి మహేందర్ గంటల రేణుక కనుక భారతి తిట్ల ఈశ్వరి శీలం పుష్పలత దొడ్డి మనెమ్మ జక్కుల లలిత జక్కుల సుమిత్ర సుజాత గజలి లక్ష్మణ్ ఆర్య కిషోర్ నీరటి శ్రీనివాస్ బ్యాగరి వెంకటేష్ గుజ్జుక పరుశురాం కాడే శంకర్ కాల్వ నరేష్ బెజ్జం రమేష్ పనికాల శ్రీనివాస్ ఉసిల్ల ఉదయ్ తవ్వా జైపాల్ ధారా సాత్విక్ ఉండమల్ల తిరుపతి పెరుమాళ్ళ యాదగిరి లింగం కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ మోసాలపై బీఆర్ఎస్ పోరుబాట

- రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- రేపటి నుండి వారంరోజులు నిరసన కార్యక్రమాలు

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 31 మహా:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ పార్టీ చేపట్టనున్న "కాంగ్రెస్ 420 మోసాలపై పోరుబాట" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. శేరిగూడలో సోమవారం జరిగిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిదిగా పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులు గడుస్తున్నా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని చెప్పారు. ఎన్నికలకు ముందు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిన కాంగ్రెస్ పార్టీ నమ్మిన ప్రజలను నిట్టనిలువుగా దగా చేసిందని ఆయన మండిపడ్డారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, మహిళలకు నెలకు 2500, వృద్దులు, వితంతువులకు నెలకు నాలుగు వేలు, వికలాంగులకు నెలకు ఆరువేలు, ఎకరాకు 15వేల రైతుబంధు, విధ్యార్థినులకు స్కూటీలు, కళ్యాణలక్ష్మితోపాటు తులం బంగారం, కౌలు రైతులకు పన్నెండు వేలు, ఐదు లక్షల విద్యా భరోసా కార్డు తదితర కాంగ్రెస్ 420 హామీలు ఒక్కటి కూడా అమలు కాలేదని ఆయన విమర్శించారు. యవత, విద్యార్థులు, రైతులు, మహిళలు, ఉద్యోగులు, ఆర్టీసీ ఉద్యోగులు సబ్బండవర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక ఎమ్మెల్యే అరాచకాలు, ఎన్నికల హామీల అమలులో జరుగుతున్న మోసం, ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను ప్రజానీకానికి చేరవేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి, జిల్లా రైతుబంధు మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు జక్క రాంరెడ్డి, మున్సిపల్ ఛైర్మెన్ టేకుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపిపి కృపేష్, ఏర్పుల చంద్రయ్య, బూడిద రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొత్త కిషన్ గౌడ్, చిలుకల బుగ్గరాములు, మున్సిపల్ అధ్యక్షులు అల్వాల వెంకట్ రెడ్డి, కొప్పు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# వనస్థలిపురంలో రవీంద్ర భారతి తరహా ఆడిటోరియం నిర్మిస్తాం: మధుయాష్కి గౌడ్


- సంస్కృతిక నృత్యాలతో అలరించిన చిన్నారులు
- ఆడిటోరియం నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు

**ఎల్బీనగర్ ఆగస్టు 31 మహా:** ఎస్కెఎన్ కళాక్షేత్రం ఆధ్వర్యంలో వనస్థలిపురం రైతు బజార్ వద్ద పార్కులో 150 మంది విద్యార్థులతో నిర్వహించిన సంగీత నృత్యరూపకం కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ హాజరయ్యారు. తమ సంగీతం, నృత్యంతో ప్రేక్షకులను ఆలరించిన చిన్నారులను మధుయాష్కి అభినందించారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ... రవీంద్ర భారతి తరహాలో వనస్థలిపురంలో రూ. 25 కోట్లతో ఆడిటోరియాన్ని నిర్మించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సానుకూలత తెలిపారని, త్వరలో నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వం నుంచి సహకారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, డివిజన్ల అధ్యక్షులు కొల్లూరు శ్రీనాథ్, గోపి రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, రమాకాంత్ గుప్తా, డివిజన్ మాజీ అధ్యక్షులు కుట్ల నరసింహ యాదవ్, మకుటం సదాశివుడు, డీసీసీ ఉపాధ్యక్షులు కొండోజు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిలు స్వర్ణ మాధవి, దేరంగుల కృష్ణ, జిల్లా స్పోక్స్ పర్సన్ దాము మహేందర్ యాదవ్, కార్యదర్శులు రిజ్వాన్, నరేష్ గుప్తా, నాయకులు శశికాంత్, ఇర్ఫాన్, కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ సూలాపాణి, వెంకటాచార్య పాల్గొన్నారు.



# రాత్రంతా శిరీష కుటుంబం తోనే ... అన్నివిధాలుగా అండగా ఉంటా

**అంత్యక్రియలలో నేరుగా పాల్గొన్న ఎమ్మెల్యే జారె.**



**దమ్మపేట ,మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,ములకలపల్లి మండలానికి చెందిన ఊకె శిరీష , హైదరాబాద్ లోని ప్రైమ్ కేర్ ప్రైవేటు వైద్యశాలలో నర్సుగా విదులు నిర్వహిస్తూ శుక్రవారం అత్యాచారానికి గురై , మారణకాండకు బలైన సంగతి పాఠకులకు తెలిసిందే. విషయం తెలుసుకున్న అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ హుటాహుటిన శిరీష స్వగ్రామమైన చౌటుగూడెంకు చేరుకొని ఆదివారం రాత్రంతా అక్కడే గడిపారు. హైదరాబాద్ లో శిరీష మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం స్వగ్రామానికి తరలిస్తున్నారనే వార్త తెలుసుకొని అంబులెన్స్ ను తన చరవాణీ ద్వారా అనుక్షణం మార్గనిర్దేశం చేస్తూ తెల్లవారు వరకు ఫాలోయింగ్ చేస్తూ స్వయంగా మృతదేహానికి దహనసంస్కారాల కార్యక్రమంలో పాల్గొన్నారు. తానే స్వయంగా పార్థీవ దేహానికి పాడెను ఎత్తుకొని గిరిజనులకు అండగా నిలిచారు.

**కుటుంబానికి బాసటగా నిలుస్తా:**

గిరిజన ఆదివాసి యువతి ఐనటువంటి ఊకే శిరీష నిరుపేద కుటుంబంలో జన్మించి ,ప్రభుత్వ ఆశ్రమ వసతి గృహంలో ,అంకంపాలెం లో పదవ తరగతి వరకు విద్యను అభ్యసించి నర్సింగ్ కోర్సు పూర్తి చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. తన కుటుంబ కష్టాలను ఆర్థికంగా తీర్చారని ,కుటుంబానికి బాసటగా నిలవాలని శిరీష నర్సుగా ఓ ప్రైవేటు వైద్యశాల లో విదులు నిర్వహించుకుంటూ ,కుటుంబ సభ్యులకు అండగా నిలిచిందన్నారు. ప్రైవేటు వైద్యశాల నిర్లక్ష్యం కారణంగా ,అసౌకర్య వసతుల వలన నేడు గిరిజన బిడ్డ అత్యాచారానికి గురై బలైపోయిందని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒక ఎమ్మెల్యే గా కాకుండా ,సాధారణ గిరిజన పౌరుడిలా శిరీష కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. నేరం చేసిన వారు ఎంతటి హోదాలో ఉన్నా చట్టపరమైన చర్యలు తీసుకొనేంతవరకు తాను విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. అవసరమైతే ఈ విషయం పై ప్రభుత్వం తో స్వయంగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా నిందితులను పట్టకొని తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని ,కుటుంభానికి అన్ని విధాలుగా బాసటగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ,కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## సంచార జాతుల అభివృద్ధి కోసం

# ప్రభుత్వం పాటుపడాలి

- సంచార జాతుల అభివృద్ధికి శాశ్వత ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి
- కేంద్ర సంచార జాతుల బోర్డు మాజీ ఛైర్మన్ బికు రాంజీ ఇదాతే



**జవహర్ నగర్, మహా :** సంచార జాతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం పాటుపడాలని, సంచార జాతుల స్థిర నివాసానికి ప్రభుత్వం పక్కా ఇల్లు కట్టివ్వాలని, సంచార జాతుల అభివృద్ధికి శాశ్వతంగా ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని కేంద్ర సంచార జాతుల బోర్డు మాజీ ఛైర్మన్ బికు రాంజీ పేర్కొన్నారు. జవహర్ నగర్ దేవేందర్ నగర్ లోని వడ్డే ఓబన్న విగ్రహ ప్రాంగణంలో సోమవారం 75వ సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బికు రాంజీ ఇదాతే ముఖ్యఅతిథిగా హాజరై వడ్డే ఓబన్న విగ్రహానికి పూల మాలలు వేసి వందనం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్రం సిద్ధించి 80 ఏళ్లు గడుస్తున్నా సంచార జాతుల జీవితాల్లో ఎలాంటి పురోగతి కనిపిస్తలేదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఓటు బ్యాంకు గానే వాడుకుంటున్నారే తప్పితే చేసిందేమీ లేదని, శాశ్వతంగా ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి సంచార జాతుల్లో కొత్త కాంతులు నింపాలని ఆయన తెలిపారు.






## 'హతః' టైటిల్ గ్లింప్స్‌తో క్యూరియాసిటీ

### మిస్టరీతో ఆకట్టుకున్న కిరణ్ అబ్బవరం కొత్త సినిమా

నటుడిగా వరుస సినిమాలు చేస్తున్న కిరణ్ అబ్బవరం నిర్మాతగానూ కొత్త కథలను ప్రోత్స హిస్తున్నారు. 'తిమ్మరాజుపల్లి టీవీ' తర్వాత ఆయన నిర్మిస్తున్న రెండో చిత్రానికి 'హతః' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. తాజాగా విడుదలైన టైటిల్ గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది.గ్లింప్స్‌లో చీకటిగా ఉన్న ఓ పెట్టె కనిపించగా, కెమెరా దాని వైపు వెళ్లే సమయంలో అందులో ఓ పిల్లి ఉన్నట్లు చూపించారు. ఆ తర్వాత 'హతః' టైటిల్‌ను రివీల్ చేశారు. కథకు సంబంధించిన ఎలాంటి వివరాలను వెల్లడించకుండా ఈ మిస్టరీని కొనసాగించారు. త్వరలో టీజర్ విడుదల కానున్నట్లు కూడా హింట్ ఇచ్చారు.'హతః' చిత్రాన్ని కిరణ్ అబ్బవరం, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అనుష్ గోరక్ కథ, దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జెసిన్ జార్జ్ సంగీతం అందిస్తున్నారు. కుష్బు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవి, తనుజ పుట్టస్వామి కీలక పాత్రల్లో నటిస్తున్నారు.సినిమా కథ, పాత్రలు, జానర్‌కు సంబంధించిన వివరాలను మేకర్స్ ప్రస్తుతానికి గోప్యంగా ఉంచారు. గ్లింప్స్‌లో కనిపించిన పిల్లికి కథతో ఉన్న సంబంధం ఏమిటనేది ఆసక్తికరంగా మారింది. ఇది థ్రిల్లర్‌నా, సస్పెన్స్ డ్రామానా అనే విషయంపై కూడా స్పష్టత లేదు. తదుపరి అప్‌డేట్స్‌తో ఈ మిస్టరీకి సమాధానం లభించనుంది.

## 'ఇరుముడి' విజయంపై దిల్ రాజు ప్రశంసలు

### తెలుగు సినిమాకు కొత్త ఉత్సాహం వచ్చిందంటున్న నిర్మాత



రవితేజ నటించిన 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకెళ్తుండటంపై ప్రముఖ నిర్మాత దిల్ రాజు ప్రశంసలు కురిపించారు. హైదరాబాద్‌లో జరిగిన 'కూర్మావతార్' సినిమా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన 'ఇరుముడి' విజయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు.'ఇరుముడి' విజయం తెలుగు చిత్ర పరిశ్రమకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని దిల్ రాజు అన్నారు. ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో థియేటర్లకు రావడం నిర్మాతలు, దర్శకుల్లో మరింత ధైర్యాన్ని నింపుతుందని పేర్కొన్నారు. ఈ సినిమాతో ఇండస్ట్రీకి పాజిటివ్ ఎనర్జీ తీసుకొచ్చినందుకు 'గురుస్వామి' పాత్రలో నటించిన సాయికుమార్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.ఇక 'ఇరుముడి' బాక్సాఫీస్ వసూళ్ల విషయానికి వస్తే.. సినిమా విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ కలెక్షన్లు సాధించినట్లు చిత్రబృందం తెలిపింది. రవితేజ కెరీర్‌లోనూ ఈ చిత్రం ప్రత్యేకమైన విజయంగా నిలుస్తోంది. ముఖ్యంగా నైజాం ప్రాంతంలో సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఫ్యామిలీ ఆడియన్స్ కూడా థియేటర్లకు రావడంతో పలు ప్రాంతాల్లో హౌస్‌ఫుల్ బోర్డులు కనిపిస్తున్నాయి.కొత్త సినిమాలు విడుదలైనప్పటికీ 'ఇరుముడి'పై ప్రేక్షకుల్లో ఆసక్తి కొనసాగుతుండటం విశేషం. భారీ బడ్జెట్ చిత్రాలు బ్రేక్‌ఈవెన్ కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఈ సినిమా వేగంగా వసూళ్లు సాధించడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు 'ఇరుముడి' రూ.200 కోట్ల గ్రాస్ మార్క్‌ను అందుకుంటుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

## అది నేను కాదు.. ఫేక్ వీడియోపై శాలిని క్లారిటీ

### ఏఐతో రూపొందించిన వీడియోను షేర్ చేయొద్దని హీరోయిన్ విజ్ఞప్తి

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వీడియోపై నటి శాలిని పాండే స్పందించారు. ఆ వీడియోలో కనిపిస్తున్నది తాను కాదని, ఏఐ సాంకేతికతతో రూపొందించిన ఫేక్ వీడియో అని స్పష్టం చేశారు. కొంతకాలంగా ఈ క్లిప్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో, దీనిపై శాలిని తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వివరణ ఇచ్చారు.తనను పోలినట్లుగా వీడియోను తయారు చేయడం బాధాకరంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి నకిలీ కంటెంట్ సృష్టించడం మరింత ఆందోళన కలిగిస్తోందన్నారు. ఏఐ టెక్నాలజీని దుర్వినియోగం చేసి వ్యక్తుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కంటెంట్ తయారు చేయడం సరికాదని తెలిపారు.ఈ వీడియోను ఎవరూ షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయడం లేదా డౌన్‌లోడ్ చేయవద్దని శాలిని కోరారు. దానికి కామెంట్లు, రియాక్షన్లు ఇవ్వడం ద్వారా మరింత మందికి చేరేలా చేయకూడదని సూచించారు. ఎక్కడ కనిపించినా వెంటనే రిపోర్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు.అర్జున్ రెడ్డి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన శాలిని పాండే అనంతరం హిందీ, తమిళ చిత్రాల్లోనూ నటించారు. ఇటీవల ధనుష్ నటించిన 'ఇడ్లీ కడై'లో కీలక పాత్రలో కనిపించారు. ప్రస్తుతం తనకు సంబంధం లేని వీడియో కారణంగా ఆమె పేరు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది .ఈ వ్యవహారంపై పోలీసు ఫిర్యాదు లేదా న్యాయపరమైన చర్యల గురించి శాలిని ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. వైరల్ అవుతున్న ఫేక్ వీడియోకు మరింత ప్రచారం కల్పించకుండా దాన్ని రిపోర్ట్ చేయాలని మాత్రమే ఆమె కోరారు.





## జైలర్ 2'కు భారీ పోటీ తప్పదా?

దసరా బరిలో వరుసగా భారీ సినిమాలు.. రిలీజ్ డేట్‌పై ఉత్కంఠ**

సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జైలర్ 2' విడుదల తేదీ ఇప్పటికే అక్టోబర్ 15, 2026గా ప్రకటించారు. అయితే అదే సమయంలో టాలీవుడ్‌లో పలు భారీ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఈ రిలీజ్ డేట్‌పై ఇప్పుడు ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. పోటీని దృష్టిలో పెట్టుకుని 'జైలర్ 2' విడుదలను వాయిదా వేసే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది.2023లో వచ్చిన 'జైలర్' తమిళంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ మంచి విజయాన్ని సాధించింది. రజనీకాంత్ స్టైల్, నెల్సన్ టేకింగ్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. దీంతో సీక్వెల్‌పై తెలుగు ప్రేక్షకుల్లోనూ అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అక్టోబర్ 15న సినిమా విడుదలైతే ఆ తర్వాతి రోజే థియేటర్లలోకి రానున్న తెలుగు చిత్రాల ప్రభావం ఎలా ఉంటుందనే అంశం చర్చనీయాంశంగా మారింది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న 'రణబాలి' అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై కూడా మంచి అంచనాలు ఉన్నాయి. ఇదే సమయంలో వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ఏకే 47'కు కూడా అక్టోబర్ 16 తేదీని ప్రత్యామ్నాయంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. తొలుత అక్టోబర్ 9న విడుదల చేయాలని భావిస్తున్నప్పటికీ, ఆ తేదీ సాధ్యం కాకపోతే అక్టోబర్ 16న రిలీజ్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఈ పరిస్థితుల్లో 'జైలర్ 2' అక్టోబర్ 15న విడుదలైతే మరుసటి రోజే రెండు భారీ తెలుగు సినిమాలు రావడం బాక్సాఫీస్ వద్ద తీవ్ర పోటీకి దారితీయవచ్చు. థియేటర్ల కేటాయింపు, షోల సంఖ్య, ప్రేక్షకుల ఆదరణ వంటి అంశాల్లో సినిమాల మధ్య పోటీ ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో రజనీకాంత్‌కు ఉన్న ప్రత్యేకమైన మార్కెట్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

ఇదే సమయంలో ధనుష్, మమ్ముట్టి కీలక పాత్రల్లో నటిస్తున్న యాక్షన్ డ్రామా 'ఓమ్' కూడా అక్టోబర్ 15న విడుదలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఒకే సమయంలో పలు భారీ చిత్రాలు బరిలోకి దిగితే బాక్సాఫీస్ పోటీ మరింత రసవత్తరంగా మారనుంది.

రజనీకాంత్ 'జైలర్ 2', విజయ్ దేవరకొండ 'రణబాలి', వెంకటేష్ 'ఏకే 47', ధనుష్ 'ఓమ్' చిత్రాలు ఒకే వారాంతంలో ప్రేక్షకుల ముందుకు వస్తే ఏ సినిమాకు ఎంత మేర వసూళ్లు వస్తాయనే ఆసక్తి నెలకొంది. అయితే 'జైలర్ 2' ప్రకటించిన తేదీకే వస్తుందా, లేక వాయిదా పడుతుందా అనే విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



## సంప్రదాయ లుక్‌లో ఆకట్టుకున్న శ్రీ సత్య

### పింక్ చీరలో అందంగా మెరిసిన బిగ్‌బాస్ బ్యూటీ

తెలుగు నటి శ్రీ సత్య మరోసారి తన తాజా సంప్రదాయ లుక్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె షేర్ చేసిన అందమైన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఈ చిత్రాలకు అభిమానుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

ఈ ఫొటోల్లో శ్రీ సత్య ముదురు పింక్ రంగు చీరలో కనిపించారు. భారీ డిజైన్‌తో ఉన్న బ్లౌజ్‌ను ధరించి సంప్రదాయ అందంతో ఆకట్టుకున్నారు. ఆమె ధరించిన ఆభరణాలు ఈ లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నీలం, ఆకుపచ్చ రంగు రాళ్లతో కూడిన పెద్ద సంప్రదాయ చెవిపోగులు ధరించారు. జుట్టును సింపుల్‌గా స్టైలిష్‌గా అలంకరించుకున్నారు.

శ్రీ సత్య తన ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్‌లో ఈ ఫొటోలను షేర్ చేయగా, ఇప్పటికే వేలాది లైక్స్, కామెంట్లు వచ్చాయి. నటి లుక్‌ను తీర్చిదిద్దడంలో విన్నూ బేబీ స్టైలింగ్ అందించారు. అనూప్ ఫొటోగ్రఫీ ఈ ఫొటోలను చిత్రీకరించింది. చీర, ఆభరణాలు, హెయిర్‌స్టైల్‌తో పాటు శ్రీ సత్య మొత్తం లుక్‌ను ఫొటోగ్రఫీ ద్వారా అందంగా చూపించారు.

శ్రీ సత్య తెలుగు ప్రేక్షకులకు నటి, మోడల్‌గా పరిచయం. తెలుగు సీరియళ్లలో నటించడం ద్వారా బుల్లితెర ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం బిగ్‌బాస్ తెలుగు సీజన్ 6లో పాల్గొనడంతో ఆమెకు మరింత క్రేజ్ వచ్చింది. బుల్లితెర, వినోద రంగంలో తన ప్రయాణంతో శ్రీ సత్య ప్రత్యేకమైన అభిమాన వర్గాన్ని సంపాదించుకున్నారు. నటనతో పాటు సోషల్ మీడియాలోనూ శ్రీ సత్య చురుగ్గా ఉంటారు. ఫ్యాషన్, సంప్రదాయ దుస్తులు, తన ప్రొఫెషనల్ జీవితానికి సంబంధించిన ఫొటోలను తరచూ అభిమానులతో పంచుకుంటుంటారు. తాజాగా పింక్ చీరలో ఆమె షేర్ చేసిన ఫొటోలు కూడా సంప్రదాయ ఫ్యాషన్‌పై తనకున్న ఆసక్తిని మరోసారి చూపిస్తున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com